


విజయభాను

విశాఖపట్నం, బుధవారం 02-08-2023 | VIJAYABHANU DAILY * VISAKHAPATNAM | సంపుటి : 47 సంచిక : 258 పేజీలు : 08 వెల : 1 రూపాయి





# మారనున్న విశాఖ రూపురేఖలు....



**దక్షిణాదిలోనే విశాఖ ఇనార్బిట్ మాల్ అతిపెద్దది**

**విశాఖపట్నం కైలాసపురంలో ఇనార్బిట్ మాల్ నిర్మాణపనులకు భూమిపూజ చేసిన సీఎం వైయస్.జగన్.**



విశాఖపట్నం **(విజయభాను న్యూస్)** : విశాఖపట్నం కైలాసపురంలో ఇనార్బిట్ మాల్ నిర్మాణపనులకు భూమిపూజ చేసిన సీఎం వైయస్.జగన్. విశాఖ పర్యటన సందర్భంగా అక్కడ రూ.600 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న రహేజా గ్రూప్స్ ఇనార్బిట్ మాల్‌కు భూమి పూజ చేశారు. విశాఖపట్నం కైలాసపురంలో నిర్మిస్తున్న ఇనార్బిట్ మాల్ నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు సీఎం జగన్. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి వైయస్.జగన్ ఆణిముత్యంలాంటి ప్రాజెక్టు... దేవుడి దయతో మరో మంచి కార్యక్రమం ఇక్కడ ప్రారంభమవుతుంది. విశాఖ అభివృద్ధికి మరింత దోహదం చేస్తూ... విశాఖపట్టణంలో ఆణిముత్యంగా నిల్చిపోయే మంచి ప్రాజెక్టుకు శంకుస్థాపనతో శ్రీకారం చుట్టాం. 17 ఎకరాల

తరువాయి 4లో..

# ఈ గౌరవం జాతికి అంకితం..

**తిలక్‌కు ప్రజలే 'లోకమాన్య' బిరుదు ఇచ్చారు : మోదీ**



పుణే (మహారాష్ట్ర) : 'లోకమాన్య' బాల గంగాధర్ తిలక్ ఘనతను ప్రజలే గుర్తించారని, ఆయనకు 'లోకమాన్య' బిరుదును ఇచ్చారని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ చెప్పారు. లోకమాన్య తిలక్ జాతీయ పురస్కారాన్ని స్వీకరించడం తనకు మధుర జ్ఞాపకమని తెలిపారు. స్వాతంత్ర్య సమర యోధుడు తిలక్ 103వ వర్ధంతి సందర్భంగా జరిగిన కార్యక్రమంలో మోదీకి మంగళవారం ఈ పురస్కారాన్ని ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి ప్రతిపక్ష కూటమిలో కీలక నేత, ఎన్‌సీపీ వ్యవస్థాపకుడు శరద్ పవార్ హాజరవడం చర్చనీయాంశంగా మారింది. లోకమాన్య తిలక్ స్మారక్ మందిర్ ట్రస్ట్ మోదీకి ఈ పురస్కారాన్ని ప్రదానం చేసింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శరద్ పవార్ హాజరయ్యారు. మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే, ఉప ముఖ్యమంత్రులు దేవేంద్ర ఫడ్నవీస్, అజిత్ పవార్ కూడా వేదికపై ఆసీనులయ్యారు. శరద్ పవార్, మోదీ ఎంతో ఆత్మీయంగా మాట్లాడుకున్నారు. ఇటీవల ఎన్‌సీపీలో చీలిక వచ్చిన తర్వాత వీరిద్దరూ ఒకే వేదికపైకి రావడం ఇదే తొలిసారి. ఇది ప్రతిపక్ష ఇండియా కూటమిలోని పక్షాలకు రుచించడం లేదు.

**ప్రముఖుల జాబితాలో మోదీ : శరద్ పవార్**

శరద్ పవార్ మాట్లాడుతూ, పుణే నగరానికి గొప్ప చరిత్ర ఉందని తెలిపారు. ఈ నగరానికి దేశంలో చాలా ప్రాధాన్యం ఉందన్నారు. పుణే జిల్లాలోని శివనేరి కోటలో ఛత్రపతి శివాజీ మహారాజు జన్మించారని, చాలా మంది రాజులు తమ పేరుపై రాజ్యాలను స్థాపించారని, శివాజీ మహారాజు మాత్రం హైందవి స్వరాజ్‌ను ఏర్పాటు చేశారని చెప్పారు. లోకమాన్య తిలక్ పురస్కార ప్రదాన కార్యక్రమంలో శరద్ మాట్లాడుతూ, ఇటీవల మన సైనికులు సర్జికల్ స్ట్రైక్స్ చేశారని, అయితే అటువంటి దాడులను మొదట చేసినవారు ఛత్రపతి శివాజీ మహారాజు అని చెప్పారు. ఆయన లాల్ మహల్‌లో సయిస్తా ఖాన్‌పై సర్జికల్ స్ట్రైక్స్ చేశారని చెప్పారు. లోకమాన్య తిలక్ పురస్కారాన్ని స్వీకరిస్తున్న మోదీని

తరువాయి 2లో..

# అభివృద్ధి పథంలో ఆంధ్ర విశ్వవిద్యాలయం

- నవ్య చరిత్రను లిఖించే నూతన ప్రాజెక్టులకు సీఎం ప్రారంభోత్సవం
- ఏ యూ లో ఐదు అభివృద్ధి ప్రాజెక్టులను ప్రారంభించిన ముఖ్యమంత్రి
-130 కోట్ల రూపాయల వ్యయంతో అభివృద్ధి చేసిన ప్రాజెక్టులను ప్రారంభించడం పట్ల సంతోషం వ్యక్తం చేసిన ముఖ్యమంత్రి

ఆంధ్రవిశ్వవిద్యాలయం **(విజయభాను న్యూస్) :** ఆంధ్ర విశ్వ విద్యాలయానికి మంగళవారం మధ్యాహ్నం రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్ మోహన్ రెడ్డి విచ్చేసారు. వర్సిటీలో ఐదు అభివృద్ధి కార్యక్రమాలను ఆయన ప్రారంభించారు. మంగళవారం మధ్యాహ్నం గం.01.39ని.కు సిరిపురం వద్దనున్న ఫార్మ ఇంక్యుబేషన్, బయో మానిటరింగ్ హబ్–ఎలిమెంట్ కి చేరుకున్నారు. ఎలిమెంట్ భవనాన్ని ప్రారంభించిన అనంతరం అదే వేదిక నుంచి మరో నాలుగు భవనాల శిలాఫలకాల ఆవిష్కరించి ప్రారంభించారు.గత మూడు సంవత్సరాలుగా ఆంధ్ర విశ్వవిద్యాలయంలో 18 ప్రాజెక్టులు చేపట్టగా, వీటిలో ఐదు ప్రాజెక్ట్‌లను మంగళవారం ముఖ్యమంత్రి చేతుల మీదుగా ఆరంభించారు. అవి టెక్ స్టార్టప్ ఇంక్యుబేషన్ సెంటర్– ఆ హబ్, ఫార్మ ఇంక్యుబేషన్ –ఎలిమెంట్, ఏయూ డిజిటల్ జోన్ అండ్ స్మార్ట్ క్లాస్ రూమ్ కాంప్లెక్స్–అల్గారిథమ్, ఏయూ స్కూల్ ఆఫ్ ఇంటర్నేషనల్ బిజినెస్(ఏయూ సిబ్), ఏయూ అవంతి ఆక్వా కల్చర్ ఇన్నోవేషన్

తరువాయి 2లో..




# రాయలసీమ కోసం జగన్ ఏనాడైనా పనిచేశారా?

**తెదేపా అధినేత చంద్రబాబు**



నందికొట్కూరు: వైకాపా పాలనలో నియోజకవర్గానికి ఒక సైకో తయారవుతున్నారని తెదేపా అధినేత చంద్రబాబు విమర్శించారు. రౌడీయిజం చేస్తే తాటతీస్తానని.. వదిలిపెట్టే ప్రసక్తే లేదని చెప్పారు. 'సాగునీటి ప్రాజెక్టుల సందర్శన'లో భాగంగా నంద్యాల జిల్లా పర్యటకు వెళ్లిన చంద్రబాబు.. నందికొట్కూరులో నిర్వహించిన


తరువాయి 2లో..



భారత ఎన్నికల సంఘం నుంచి సీనియర్ డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్ ధర్మేంద్ర శర్మ , నితేష్ వ్యాస్ , డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్ హిర్దేశ్ కుమార్ ,సీనియర్ ప్రిన్సిపల్ సెక్రటరీ నరేంద్ర బూటోలియా విశాఖపట్నం పర్యటన సందర్భంగా మంగళవారం సాయంత్రం విశాఖపట్నం ఎయిర్ పోర్ట్ చేరుకున్నారు. వారికి విమానాశ్రయం లో జిల్లా కలెక్టర్ డా.ఏ. మల్లికార్జున, జాయింట్ కలెక్టర్ కె.యస్. విశ్వనాథన్ , ఆర్డిఓ లు హుస్సేన్ సాహెబ్ , బాస్కర్ రెడ్డి , డిప్యూటీ కలెక్టర్లు లు రంగయ్య , లక్ష్మ రెడ్డి , రెవిన్యూ అధికారులు స్వాగతం పలికారు.

# ఆ మాటకు ఇప్పటికీ కట్టుబడి ఉన్నా..

**వైసీపీ ప్రభుత్వంపై ఆగ్రహం**



అమరావతి: వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సర్కారు తీరుపై ఏపీ బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం చేసిన అప్పులపై ప్రజలకు జవాబుగా శ్వేత పత్రం ఎందుకు విడుదల చేయడం లేదని ఆమె ప్రశ్నించారు. "జగన్ ప్రభుత్వం చేసిన అప్పులకు, తప్పులకు మల్ల గుల్లాలు పడుతుంది. జగన్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన

తరువాయి 2లో..




# మిషన్ మోడ్‌లో జగనన్న సురక్ష కార్యక్రమం అమలు

- జిల్లాలో నెల రోజుల వ్యవధిలో 2,68,326 సేవా విజ్ఞప్తుల పరిష్కారం
- జగనన్న సురక్ష శిబిరాల్లో ఉచితంగా సర్టిఫికెట్లు, సేవల అందజేత
- కాకినాడ జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా



కాకినాడ : రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా కాకినాడ జిల్లాలో మిషన్ మోడ్‌లో 2,68,326 సేవా విజ్ఞప్తులను పరిష్కరించినట్లు కలెక్టర్ డా. కృతికా శుక్లా తెలిపారు. మంగళవారం కలెక్టరేట్ స్పందనహాల్‌లో జగనన్న సురక్ష కార్యక్రమంపై ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కలెక్టర్ కృతికా శుక్లా.. డీఆర్వో కె.శ్రీధర్‌రెడ్డితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ కృతికా శుక్లా మాట్లాడుతూ గౌరవ ముఖ్యమంత్రి జూన్ 23వ తేదీన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించారని.. ఇది జులై 31 వరకు కొనసాగినట్లు తెలిపారు. నూటికి నూరు శాతం సంతృప్తి స్థాయిలో పారదర్శకంగా సంక్షేమ పథకాలు అందించడంతో పాటు ప్రజలకు అవసరం మేరకు 11 రకాల సర్టిఫికెట్లను ఉచితంగా అందించేందుకు ఈ కార్యక్రమాన్ని అమలుచేసినట్లు వివరించారు. జిల్లాలోని 620 గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో వాలంటీర్లు, సచివాలయ సిబ్బంది ప్రతి ఇంటికీ వెళ్లి.. సేవలు అవసరమైన వారిని గుర్తించారని.. టోకెన్ల జారీ అనంతరం సర్వీస్ రిక్వెస్టులను సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ చేయించినట్లు తెలిపారు. ప్రజల సమస్య పరిష్కారానికి, వివిధ రకాల సర్టిఫికెట్లను అందించేందుకు అవసరమైన డాక్యుమెంట్లు తీసుకొని దగ్గర ఉండి మరి దరఖాస్తులను నింపినట్లు వివరించారు. జులై 1వ తేదీ నుంచి మండల స్థాయి అధికారులైన తహసీల్దారు, ఈవోపీఆర్‌డీ ఒక ఒక టీమ్‌గా.. ఎంపీడీవో, డిప్యూటీ తహసిల్దార్ మరో టీమ్‌గా ఏర్పడి ప్రతి సచివాలయం పరిధిలో పూర్తిగా ఒకరోజు ఉండేలా జగనన్న సురక్ష క్యాంపులు నిర్వహించి.. సర్టిఫికెట్లను, సేవలు అందించినట్లు కలెక్టర్ తెలిపారు.

**1,23,687 ఇంటెగ్రేటెడ్ సర్టిఫికెట్ల జారీ:**

సాధారణంగా జిల్లాలో నెలకు సగటున 10 వేల నుంచి 11 వేల వివిధ రకాల సర్టిఫికెట్లను అందించడం జరుగుతోందని.. అయితే నెల రోజుల పాటు జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో మిషన్ మోడ్‌లో 2.30 లక్షలకుపైనే ఉచితంగా సర్టిఫికెట్లు అందించడం జరిగిందని.. ఇది గొప్ప విజయమని పేర్కొన్నారు. ఎవరూ తహసీల్దార్, ఎంపీడీవో, ఇతర కార్యాలయాలకు వెళ్లనవసరం లేకుండా వారి ఇళ్ల వద్దే సర్టిఫికెట్లు, సేవలు అందించినట్లు వెల్లడించారు. అర్హత ఆధారంగా దరఖాస్తులను పూర్తిస్థాయిలో పరిష్కరించినట్లు తెలిపారు. 1,23,687 ఇంటెగ్రేటెడ్ క్యాస్ట్ సర్టిఫికెట్లు, 1,13,653 ఆదాయ ధ్రువీకరణ సర్టిఫికెట్లు జారీచేసినట్లు వెల్లడించారు. అదే విధంగా ఆధార్ కార్డుతో మొబైల్ నంబర్ అనుసంధానానికి సంబంధించి 10,911 దరఖాస్తులను పరిష్కరించినట్లు వివరించారు. రైస్ కార్డులోని సభ్యుల విభజన, సభ్యుల చేర్పులకు సంబంధించి 2,459 దరఖాస్తులను పరిష్కరించినట్లు తెలిపారు. అదే విధంగా మండలాలు, పరిష్కరించిన దరఖాస్తుల సంఖ్యను పరిగణనలోకి తీసుకుంటే కాకినాడ అర్బన్ (29,703), ప్రత్తిపాడు (24,060), తాళ్లరేవు (15,736), కాజులూరు (15,085), కాకినాడ రూరల్ (15,067) తొలి అయిదు స్థానాల్లో నిలిచినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు సైతం కీలక భాగస్వామ్యం అందించారని.. అదే విధంగా ప్రజాప్రతినిధులకు క్షేత్రస్థాయి నుంచి అందిన ఫిర్యాదులను జేకేసీలో నమోదు చేయడం జరిగిందని.. వాటిని కూడా త్వరితగతిన పరిష్కరించనున్నట్లు కలెక్టర్ తెలిపారు.

**జేకేసీ కింద 5,076 గ్రీవెన్స్‌లు:**

జగనన్నకు చెబుదాం (జేకేసీ-1902) కార్యక్రమాన్ని గౌరవ ముఖ్యమంత్రి 2023, మే 9న ప్రారంభించారని.. అప్పటి నుంచి చూస్తే ఆగస్టు 1వ తేదీ వరకు ఈ కార్యక్రమం కింద మొత్తం 5,076 గ్రీవెన్స్‌లు నమోదయ్యాయని.. వీటిలో 84 శాతం అర్జీలను పరిష్కరించినట్లు తెలిపారు. సంతృప్తికరంగా లేని 55 గ్రీవెన్స్‌లను పరిష్కారం నిమిత్తం పైఅధికారులకు పంపించినట్లు వెల్లడించారు. ఎక్కువగా రెవెన్యూ, ఈపీడీసీఎల్, పంచాయతీరాజ్, మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్, హౌసింగ్, పోలీస్ శాఖల పరిధిలో అర్జీలు వచ్చినట్లు వివరించారు. రెవెన్యూకి సంబంధించి ఎక్కువగా సివిల్ వివాదాలపై అర్జీలు వస్తున్నందున మండలస్థాయిలో తహసీల్దార్, సీఐ, ఈవోపీఆర్‌డీలతో ప్రత్యేకంగా కమిటీ ఏర్పాటుచేసినట్లు తెలిపారు. ప్రతి మంగళవారం ప్రత్యేకంగా ఈ బృందం సమావేశమై సమస్యల పరిష్కారానికి కృషిచేస్తున్నట్లు వెల్లడించారు. మండలస్థాయిలో పరిష్కారం కాని సమస్యలను జాయింట్ కలెక్టర్ నేతృత్వంలోని జిల్లాస్థాయి కమిటీ పరిశీలనకు వెళ్తున్నట్లు తెలిపారు. అక్కడ సమగ్ర పరిశీలన అనంతరం తగిన నిర్ణయం తీసుకోవడం జరుగుతుందన్నారు. వానలకు ముందు ఎండలు ఎక్కువగా ఉన్న నేపథ్యంలో లోవోల్టేజ్, విద్యుత్ సరఫరా అంతరాయాలు చోటుచేసుకున్న నేపథ్యంలో ఈపీడీసీఎల్ పరిధిలో కొన్ని అర్జీలు నమోదైనట్లు తెలిపారు. పంచాయతీరాజ్‌కు సంబంధించి డ్రెయిన్ల పూడికతీత, వీధిలైట్లు, పారిశుధ్యం తదితరాలపైనా అర్జీలు నమోదైనట్లు తెలిపారు. అర్జీలకు సంబంధించి హాట్‌స్పాట్ పంచాయతీలను గుర్తించి.. అక్కడి పంచాయతీ కార్యదర్శులను అప్రమత్తం చేసినట్లు వెల్లడించారు. హౌసింగ్‌కు సంబంధించి ఇళ్ల స్థలాల పట్టాలు, ఇళ్ల మంజూరుకు సంబంధించి అర్జీలు వస్తున్నాయని.. అర్హత మేరకు ఈ అర్జీలను పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. జగనన్నకు చెబుదాం అర్జీల పరిష్కారంలో సంతృప్తి విషయంలో కాకినాడ జిల్లా మొదటి స్థానంలో ఉందని.. ఈ సంతృప్తి స్థాయిని మరింత పెంచేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. జేకేసీ కార్యక్రమంలో భాగంగానే ప్రజలకు మరింత చేరువయ్యేందుకు వీలుగా డయల్ యువర్ కలెక్టర్, డయల్ యువర్ ఎస్పీ, డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమాలను ప్రతి వారం నిర్వహిస్తున్నట్లు వివరించారు. ప్రతి కార్యక్రమంలోనూ 20-30 అర్జీలు వస్తున్నాయని.. వారం రోజుల వ్యవధిలో 75 శాతం వరకు అర్జీలు పరిష్కారమవుతున్నట్లు కలెక్టర్ కృతికా శుక్లా తెలిపారు. సమావేశంలో డిఐపిఆర్‌ఓ డి. నాగార్జున తదితరులు పాల్గొన్నారు

# అభివృద్ధి పథంలో ఆంధ్ర విశ్వవిద్యాలయం



స్కిల్ హబ్లను ప్రారంభించారు. ఆంధ్ర విశ్వ విద్యాలయంలో యువతను ఆవిష్కర్తలుగా తీర్చిదిద్దడానికి ఉపయుక్తంగా నిలిచే ఈ ఐదు కేంద్రాల ప్రత్యేకతలను, పనితీరు, ప్రగతిని ఏయువిసి ఆచార్య పీవీ జి డి ప్రసాద్ రెడ్డి స్వయంగా ముఖ్యమంత్రి కి వివరించారు. ఎలిమెంట్ భవనంలో ఏర్పాటుచేసిన ఫార్మసీ లేబరేటరీని ముఖ్యమంత్రి పరిశీలించి అక్కడ ఉన్న ఉపకరణాలు పనితీరు తెలుసుకున్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయంలో 130 కోట్ల రూపాయల వ్యయంతో విద్యార్థులకు ఉపయుక్తంగా అభివృద్ధి చేసిన భవనాలు ప్రాజెక్టులను ప్రారంభించడం పట్ల ముఖ్యమంత్రి సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో టీటీడీ చైర్మన్ వై వి సుబ్బారెడ్డి, విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడుదల రజని, ఉపముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు, ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్, ఉన్నత విద్యా మండలి చైర్మన్ ఆచార్య కే హేమచంద్ర రెడ్డి, ఉన్నత విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ జె.స్యామలరావు, ఏయూ రెక్టర్ ఆచార్య కె.సమత, రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, అవంతి ఫీడ్స్ అధినేత ఇంద్ర కుమార్, జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ మల్లికార్జున, జీవి ఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ, జాయింట్ కలెక్టర్ కె.ఎస్. విశ్వనాధన్, ఏయూసెనేట్ సభ్యులు డాక్టర్ కుమార్ రాజా, ప్రిన్సిపాల్ ఆచార్య వై రాజేంద్రప్రసాద్, కె.శ్రీనివాసరావు, జి.సషి భూషణరావు, ఏ నరసింహారావు, టి. శోభ ఎస్. కె భట్టి, అంబేద్కర్ చైర్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం. జేమ్స్ స్టీఫెన్, incubation సెంటర్ సీఈవో రవి ఈశ్వరపు, ఆచార్య కృష్ణ మంజరి పవర్, టి.షారోన్ రాజు ఆచార్య ఎన్ఏడి పాల్, ఆచార్య కె. బసవయ్య తదితరులు పాల్గొన్నారు.

ఏయు ప్రిన్సిపల్స్, ఇతర అధికారులను ముఖ్యమంత్రి కి వీసి ప్రసాద్ రెడ్డి స్వయంగా పరిచయం చేశారు. ఎలిమెంట్ భవనం బయట పెద్ద సంఖ్యలో విద్యార్థులు ముఖ్యమంత్రికి స్వాగతం పలికారు. వీరికి ముఖ్యమంత్రి చిరునవ్వుతో అభివాదం చేస్తూ పలకరించారు. ప్రారంభోత్సవ భవనాల వివరాలు.

ఆ హబ్.... ఆంధ్రవిశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ విద్యార్థులకు ఆవిష్కర్తలుగా, భవిష్యత్ పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దే వేదికగా ఆ హబ్ని తీర్చిదిద్దారు. ఇంజనీరింగ్ కళాశాలలో 30 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో రూ 21 కోట్ల వ్యయంతో దీనిని నిర్మించారు. దీనిలో ఇప్పటికే 121 స్టార్టప్లు పనిచేస్తూ వీటిలో 114 వరకు

ఆర్థిక వనరులను సృష్టించే స్థాయికి చేరుకున్నాయి.

**ఎలిమెంట్.....**

ఫార్మ ఇంక్యుబేషన్, బయోలాజికల్ మానిటరింగ్ హబ్గా ఎలిమెంట్ను ఏర్పాటు చేసారు. దాదాపు 55 వేల సదరపు అడుగుల విస్తీర్ణంలో ఫార్మ, బయో, జినోమిక్స్ ఇంక్యుబేషన్, టెస్టింగ్ ల్యాబ్గా దీనిని దాదాపు 44 కోట్ల రూపాయలతో దీనిని ఏర్పాటు చేసారు. ఔషధ రంగాలలో స్టార్టప్ ఇన్నోవేషన్ ని ప్రోత్సహించే విధంగా ఎలిమెంట్ ఏర్పాటు చేసారు.

**అల్గారిథం....**

ఆంధ్రవిశ్వవిద్యాలయం డిజిటల్ జోన్, స్మార్ట్ క్లాస్రూం కాంప్లెక్స్ని

అల్గారిథంగా పేరు పెట్టారు. ఇంజనీరింగ్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ విభాగం ఎదురుగా 60 వేల చదరపు అడుగుల విస్తీర్ణంతో రూ 35 కోట్ల వ్యయంతో దీనిని నిర్మించడం జరిగింది. ఈభవనంలో 250 మంది కూర్చునే సామర్థ్యం కలిగిన సెమినార్ హాళ్లు 2, స్మార్ట్ క్లాస్ రూమ్లు 15, ఆన్లైన్ పరీక్షల నిర్వహణకు ఉపయుక్తంగా 500 కంప్యూటర్లతో కూడిన ఒక పూర్తి అంతస్థను కలిగి ఉంది.

**ఏయూ సిబ్....**

ఆంధ్రయూనివర్సిటీ స్కూల్ ఆఫ్ ఇంటర్నేషనల్ బిజినెస్( ఏయూ సిబ్)ని ఏయూ అవుట్గేట్కి అనుకుని ఏర్పాటు చేసారు. 25వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఈ భవనం నిర్మాణానికి రూ 15 కోట్లు ఖర్చుచేసారు. ఐఐఎం విశాఖపట్నంతో అవగాహన ఒప్పందం చేసుకుని ఏయూ సిబ్ నుంచి ఎంబిఏ కోర్సును నిర్వహిస్తున్నారు. ఇంటర్నేషనల్ బిజినెస్, అనలటిక్స్ రంగాలలో బ్యాచిలర్, పీజీ కోర్సులకు ఈ కేంద్రంలో నిర్వహిస్తారుజి

ఏయూ-అవంతి ....

బీచ్రోడ్డులో ఏయూ-అవంతి ఆక్వాకల్చర్ ఇన్నోవేషన్ అండ్ స్కిల్ హబ్ ని 12 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు చేసారు. తొలి దశలో దాదాపు రూ 11 కోట్ల వ్యయంతో దీనిని ఏర్పాటు చేసారు. అవంతి ఫౌండేషన్తో చేసుకున్న అవగాహన ఒప్పందంలో భాగంగా మెరైన్ ఫార్మింగ్ రగంలో నైపుణ్య శిక్షణ, ఎంటర్ప్యూనర్షిప్ను ప్రోత్సహించే దిశగా ఈ కేంద్రం సేవలు అందిస్తుంది.

## ఐద్వా రాష్ట్ర జాతాకు సిఐటియు ఘనస్వాగతం



కాకినాడ, ఆగస్ట్ 1: మహిళలపై జరిగే హింసను అరికట్టాలని స్త్రీ, పురుష సమానత్వాన్ని ప్రోత్సహించాలని, మద్యపానాన్ని నిషేధించాలని డిమాండ్ చేశారు ఐద్వా డిమాండ్ చేసింది. చట్టసభల్లో మహిళలకు 33% రిజర్వేషన్లు అమలు చేయాలని, జస్టిస్ వర్మ సిఫారసులను రాష్ట్రంలో అమలు చేయాలని కోరుతూ ఐద్వా ప్రజాతంత్ర మహిళా సంఘం ఆధ్వర్యంలో జూలై 26 నుండి ఆగస్టు 5 వరకు జరిగే రాష్ట్ర వ్యాప్త జాతాలో భాగంగా కాకినాడ భానుగుడి సెంటర్ వద్ద సిఐటియు జాతీయ ఉపాధ్యక్షురాలు జి బేబిరాణి ఆధ్వర్యంలో సిఐటియు జిల్లా కమిటీ ఐద్వా జాతాకు ఘనస్వాగతం పలికారు.

ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దువ్వ శేషాబాబ్జి, చెక్కల రాజ్ కుమార్, నగర అధ్యక్ష, ఉపాధ్యక్షులు పలివెల వీరబాబు, మేడిశెట్టి వెంకటరమణ, జిల్లా కోశాధికారి మలకా రమణ, జిల్లా ఉపాధ్యక్షురాలు ఏరుబండి చంద్రావతి, జిల్లా సహాయ కార్యదర్శి చంద్రమళ్ల పద్మ, వర్కింగ్ కమిటీ సభ్యులు షేక్ పద్మ, నర్ల ఈశ్వరి, కొప్పిశెట్టి సత్తిబాబు, నక్కెళ్ల శ్రీను, అంగన్వాడి యూనియన్ జిల్లా కోశాధికారి రమణమ్మ, చామంతి, జ్యోతి, ధనలక్ష్మి, ఆశా కార్యకర్తలు స్వాగతం పలికిన వారిలో ఉన్నారు.

## రాయలసీమ కోసం జగన్ ఏనాడైనా పనిచేశారా?

బహిరంగ సభలో మాట్లాడారు. ఈ సందర్భంగా వైకాపా ప్రభుత్వం, సీఎం జగన్‌పై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. "రాయలసీమకు ద్రోహం చేసిన వ్యక్తి జగన్. బటన్ నొక్కుతున్నా అని పదేపదే చెబుతున్నారు. బటన్ నొక్కడం కాదు.. బటన్ బుక్కుడు ఎక్కువైంది. విద్యుత్ ఛార్జీలు పెంచుకుంటూ పోతున్నారు. ఇప్పటికి 8 సార్లు పెంచారు. తెదేపా అధికారంలోకి వచ్చాక నూతన విద్యుత్ పాలసీ తీసుకొస్తాం. విద్యుత్ ఛార్జీలు తగ్గించే బాధ్యత నాది. ఆడబిడ్డ నిధి కింద ప్రతి మహిళకు నెలకు రూ.1500 ఇస్తాం. ఆర్టీసీ బస్సుల్లో మహిళకు ఉచితంగా ప్రయాణ సౌకర్యం కల్పిస్తాం. యువగళం సూపర్ హిట్ అయింది.. యువతలో చైతన్యం వచ్చింది.

## నూతన కార్యవర్గం ఎన్నిక



యానాం శివారు దరియాల తిప్ప ఉదయ్ కృష్ణ కాలనీ గ్రామంలో నూతన కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నిక జరిగినట్లు ఆ గ్రామ పెద్దలు తెలిపారు ఈ సందర్భంగా నూతన కార్యవర్గం సభ్యులు అరదాడి శీను, గంగాధర్ రావు,ఆదినారాయణ, గంగాద్రి, సుబ్బారావు, నూకరాజు, అప్పారావు, లంకే అంజయ్య, శ్రీను తదితరులు మర్యాదపూర్వకంగా మల్లాడి సత్తిబాబు ని కలిసి దుస్సాలూవాలతో సత్కరించారు.

## ఆ మాటకు ఇప్పటికీ కట్టుబడి ఉన్నా..

తర్వాత లక్షా 77వేల 21 కోట్ల అప్పులు అని తెలుస్తుంది. గతంలో నేను ఏపీ అప్పులు 10 లక్షల కోట్లు అంటే.. ఏడు కోట్లు జగన్ ప్రభుత్వం చేసినట్లు చెప్పారు. ఎఫ్.ఆర్.బి.ఎం పరిధిలో మాత్రమే లక్షా 77వేల కోట్లు అని నిర్మలా సీతారామన్ చెప్పారు. మరి ప్రభుత్వ ఆస్తులు తనఖా పెట్టి, మద్యం ఆదాయం చూపి చేసిన అప్పులు చాలా ఉన్నాయి. ఇవన్నీ కలిపి 10 లక్షల కోట్లు అప్పు ఉందన్న మాటకు ఇప్పటికి కట్టుబడి ఉన్నాను." అని ఆమె అన్నారు. "వీటిని వివరిస్తూ నిర్మలా సీతారామన్ కు రాతపూర్వకంగా ఇచ్చాను. కోవిడ్ వల్ల నలభై వేల కోట్లు అప్పు చేసుకునే అవకాశం రాష్ట్ర ప్రభుత్వానికి వచ్చింది. ఇతర వనరులు ద్వారా అదనంగా అప్పులు చేశారు. రాష్టానికి ఎటువంటి పరిశ్రమలు రాలేదు. పదిహేను లక్షల కోట్ల ఆదాయం ఆర్.బి.ఐ కి ఎలా చూపించారు. వాటిపై రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు సమాధానం చెప్పాలి. ఈ విధంగా చాలా అంశాలకు రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు సమాధానం చెప్పాలి. ప్రజలకు రాష్ట్ర ప్రభుత్వం చేసిన అప్పులపై శ్వేత పత్రం ఎందుకు విడుదల చేయడం లేదు." అని పురందేశ్వరి మండిపడ్డారు.

# ఈ గౌరవం జాతికి అంకితం..

ఆయన ప్రశంసించారు. ఈ పురస్కారాన్ని అనేక మంది ప్రముఖులు స్వీకరించారని, ఆ జాబితాలో ఇప్పుడు మోదీ చేరారని తెలిపారు. ఈ పురస్కారాన్ని ఆయన స్వీకరిస్తున్నందుకు ఆయనను అభినందిస్తున్నానని చెప్పారు. ఈ పురస్కారాన్ని పొందినవారిలో మోదీ 41వవారు. గతంలో డాక్టర్ శంకర్ దయాళ్ శర్మ, ప్రణబ్ ముఖర్జీ, అటల్ బిహారీ వాజ్‌పాయి, ఇందిరా గాంధీ, బాలాసాహెబ్ దేవరస్, మన్మోహన్ సింగ్, ఎన్ఆర్ నారాయణ మూర్తి, ఈ శ్రీధరన్ వంటివారు ఉన్నారు.

**మోదీ ఆటోగ్రాఫ్ కోరుతున్న ప్రపంచ నేతలు : సీఎం షిండే**

మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే మాట్లాడుతూ, మోదీని ప్రపంచవ్యాప్తంగా గౌరవిస్తున్నారని, ఇతర దేశాల నేతలు మోదీ ఆటోగ్రాఫ్ తీసుకుంటున్నారని, కొందరు ఆయనను బాస్ అంటున్నారని, మరికొందరు ఆయనకు పాదాభివందనం చేస్తున్నారని చెప్పారు. ఇదంతా తమకు గర్వకారణమన్నారు.

**భారతీయులకు అంకితం : మోదీ**

లోకమాన్య బాల గంగాధర్ తిలక్ 103వ వర్ధంతి సందర్భంగా ఆయనకు నివాళులర్పించిన అనంతరం మోదీ మాట్లాడుతూ, లోకమాన్య తిలక్ జాతీయ పురస్కారాన్ని స్వీకరించడం తనకు మధుర జ్ఞాపకమని తెలిపారు. భారత దేశంలో అశాంతికి పిత తిలక్ అని బ్రిటిషర్లు ముద్ర వేశారన్నారు. బ్రిటిషర్లకు వ్యతిరేకంగా జరిగే పోరాట దిశను తిలక్ మార్చేశారన్నారు. తిలక్ ఆధునిక భారత దేశ పిత అని మహాత్మా గాంధీ అభివర్ణించారన్నారు. భారత దేశ స్వాతంత్ర్య సంగ్రామంలో తిలక్ పాత్రను ఏవో కొన్ని సంఘటనలు, మాటల ద్వారా వర్ణించలేమని చెప్పారు. మన దేశ స్వాతంత్ర్యం కోసం ఆయన విశేష కృషి చేశారని చెప్పారు. స్వాతంత్ర్య సమరయోధుడు తిలక్‌కు, సాంఘిక సంస్కర్త అన్నా భావు సాఠేలకు నివాళులర్పిస్తున్నానని చెప్పారు. ఈ పురస్కారంతో పాటు తనకు లభించిన నగదు మొత్తాన్ని 'నమామి గంగే' ప్రాజెక్టుకు విరాళంగా ఇస్తున్నట్లు ప్రకటించారు. ఈ పురస్కారాన్ని 140 కోట్ల భారతీయులకు అంకితమిస్తున్నట్లు తెలిపారు. ప్రజల సంక్షేమానికి వచ్చే ఏ అవకాశాన్నీ వదిలిపెట్టేది లేదన్నారు.

**'బ్రిటిషర్ల భావన తప్పు అని తిలక్ రుజువు చేశారు'**

భారత దేశంలోని మతాచారాలు, సంస్కృతి, సంప్రదాయాలు, నమ్మకాలు, విశ్వాసాలు వెనుకబాటుతనానికి గుర్తులని బ్రిటిషర్లు భావించారని, అదంతా శుద్ధ తప్పు అని తిలక్ నిరూపించారని చెప్పారు. అందుకే భారతీయులు తమంతట తాము ముందుకొచ్చి, తిలక్‌కు 'లోకమాన్య' అనే బిరుదును ఇచ్చి, సత్కరించారని తెలిపారు. యువత సత్తాను గుర్తించే ప్రతిభ తిలక్‌కు ఉందన్నారు. అందుకే ఆయన స్వతంత్ర వీర సావర్కర్ సత్తాను గుర్తించారన్నారు. సావర్కర్ విదేశాలకు వెళ్లి, విద్యావంతుడై, దేశ స్వాతంత్ర్యానికి కృషి చేయాలని తిలక్ కోరుకున్నారని చెప్పారు. యువత భవిత కోసం తిలక్ అనేక సంస్థలను ఏర్పాటు చేశారన్నారు. వ్యవస్థ నిర్మాణం నుంచి సంస్థ నిర్మాణం, సంస్థ నిర్మాణం నుంచి వ్యక్తి నిర్మాణం, వ్యక్తి నిర్మాణం నుంచి దేశ నిర్మాణం - అనేది దేశ నిర్మాణానికి మార్గసూచి వంటిదని చెప్పారు. నేడు భారత దేశం ఈ మార్గసూచీని చురుగ్గా, కర్తవ్య దీక్షతో అనుసరిస్తోందని తెలిపారు. మోదీ అంతకుముందు పుణేలోని శ్రీమంత్ దగ్డుషేఠ్ హల్వాయ్ గణపతి దేవాలయంలో పూజలు చేశారు.

# ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి కు ఆడారి ఘనస్వాగతం

## - ఆడారిని అభినందించిన ముఖ్యమంత్రి జగన్





ములగాడ( విజయభాను న్యూస్) : విశాఖ పర్యటనకు మంగళవారం ఉదయం నగరానికి వచ్చిన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికు వైయస్సార్‌సిపి పశ్చిమ నియోజకవర్గం సమన్వయకర్త ఆడారి ఆనంద్ కుమార్ ఘన స్వాగతం పలికారు. సుమారు 25 వేల మందితో విమానాశ్రయము నుంచి ఆర్ అండ్ బి కూడలి వరకు ఆడారి ఆనంద్ కుమార్ ఆధ్వర్యంలో మానవ హరంగా ఏర్పడి ప్రజలు, నాయకులు కార్యకర్తలు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా విమానాశ్రయం నుంచి ఆర్ అండ్ బి కూడలి వరకు ముఖ్యమంత్రికి స్వాగతం పలుకుతూ భారీ కటౌట్లు ఏర్పాటు చేశారు. ఎన్ ఎస్ టి ఎల్ కూడలిలో ఆయన ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డికు వివిధ వార్డుల కార్పొరేటర్లు ,అధ్యక్షులు, ఇన్చార్జులు, కార్యకర్తలు ప్రజలు, అభిమానులుతో కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికారు. అదేవిధంగా నగరంలో ఇనార్బిట్ మాల్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో కూడా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిని ఆడారి ఆనంద్ కుమార్ కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ముందుగా ఆడారి ఆనంద్ కుమార్ నేతృత్వంలో ప్రజలు, నాయకులు బైకులపై ర్యాలీగా జై జగన్ అంటూ విశాఖ విమానాశ్రయానికి, ఎన్ఏడి పరిసర ప్రాంతాలకు చేరుకున్నారు. ఇది ఇలా ఉండగా ఆడారి ఆనంద్ కుమార్ పట్ల ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ప్రత్యేక అభిమానం చూపారు. ఎన్ఏడిలో కలిసిన అనంతరం ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి తన సిబ్బందికి చెప్పి ఆడారి ఆనంద్ కుమార్ ను తన కాన్వాయ్ లో వెనకాల కారులో ఎక్కించికొని నగరంలో జరిగే కార్యక్రమానికి తీసుకొని వెళ్లారు. ఈ సంఘటన చూసిన నాయకులు, కార్యకర్తలు, ప్రజలు ఆడారి ఆనంద్ కుమార్ పట్ల ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఉన్న ప్రత్యేక అభిమానం మరొకసారి తేట తెల్లమయింది అని అభిప్రాయపడ్డారు. స్వాగతం పలికిన వారిలో పశ్చిమ నియోజకవర్గానికి చెందిన వివిధ వార్డుల కార్పొరేటర్లు, అధ్యక్షులు, ఇన్చార్జులు కార్యకర్తలు, ప్రజలు అభిమానులు, అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ఆకట్టుకున్న కూచిపూడి నృత్య ప్రదర్శన



భీమునిపట్నం : విజయభాను న్యూస్ శ్రీవారి శ్రావణ సప్తాహ మహోత్సవం- 2023 లో ఈనెల 27 నుంచి ఆగష్టు 2 వరకు జరుగుతున్న నేపథ్యంలో కూచిపూడి నృత్య ప్రదర్శన విశాఖ ఎంవిపి కాలనీ టిటిడి కళ్యాణ మండపంలో నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో 15 సంవత్సరం లోపు చిన్నారులను ఇంత అద్భుతంగా తీర్చిదిద్ది చిన్నారులకు ఇంత బాగా తర్ఫీదు ఇచ్చినందుకు బి.దివ్యకుమారి కి టిటిడి ఆధ్వర్యంలో సన్మానం చేశారు. నృత్య ప్రదర్శన 20 మంది పిల్లలకు టిటిడి బృందం తరపున సర్టిఫికెట్లు, నోటుబుక్కులు, ఫోటో లు బహుకరించారు.

# రామాద్రి ఆలయ గోపురం కోరాడ ఇటుకుల వితరణ



ఆనందపురం : ఆనంద పురం మండలం వేములవలస లో నిర్మిస్తున్న రామాద్రి ఆలయ గోపురం నిర్మాణానికి ఆ మండలం వేములవలస ఉపసర్పం చ్ కోరాడ నవీన్ జ్ఞానేశ్వర్ మాజీ భీమిలీ మార్కెట్ కమిటీ చైర్మన్ కోరాడ నాగభూషణరావు ఇటుకులను అందజేశారు. గ్రామంలో నిర్మిస్తున్న రామాద్రి శ్రీ సీతారాముల ఆలయ నిర్మాణానికి అత్యవసరముగా అవసరమైన 4100 ఇటుకలను సుమారు రూ.30 వేల స్వీయ నిధుల వ్యయంతో వారు అందజేశారు. ఈ సందర్భంగా నవీన్ జ్ఞానేశ్వర్ మాట్లాడు తూ గ్రామంలో నిర్మిస్తున్నటువంటి ఆలయానికి దాతలు తమ వంతు సహాయ సహకారాలు అందించి ఆలయం త్వరతగతిన పూర్తికావడానికి సహకరించాలని ఈ సందర్భంగా ఆయన కోరారు ఇకముందు కూడా ఆలయ నిర్మాణానికి తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని ఈ సందర్భంగా తెలిపారు.

# సీఎం జగన్ కు స్వాగతం

## 58వ వార్డ్ వైకాపా శ్రేణులు



ములగాడ(విజయభాను న్యూస్) : రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహనరెడ్డి అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయడానికి మంగళవారం విశాఖ విచ్చేసిన సందర్భంగా పశ్చిమ నియోజకవర్గ నియోజకవర్గ వైకాపా ఇన్చార్జ్ ఆనంద్ కుమార్ ఆదేశాల మేరకు విశాఖ వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ డైరెక్టర్ చుక్క వరలక్ష్మీ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డికు స్వాగతం పలికేందుకు 58వ వార్డ్ పిలకవానిపాలెం వైఎస్ఆర్సిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు ర్యాలీగా తరలివెళ్లారు ప్ల కార్డులతో ఎన్ ఏ డి ప్రధాన రహదారి విశాఖ ఎయిర్ పోర్ట్ వద్ద స్వాగతం పలికామని వరలక్ష్మి తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డ్ మహిళనేతలు, కార్యకర్తలు తదితరులు హాజరయ్యారు.

# గ్రామాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలి

## మండల పరిషత్ అధ్యక్షురాలు సుర్ల రాజేశ్వరి సూచన



అనకాపల్లి జిల్లా నర్సీపట్నం : మండలంలోని గ్రామాలన్నీ పరిశుభ్రంగా ఉండే విధంగా చూడాలని మండల పరిషత్ అధ్యక్షురాలు సుర్ల రాజేశ్వరి సూచించారు. మంగళవారం మండల సర్వసభ్య సమావేశాన్ని ఆమె అధ్యక్షతన నిర్వహించారు. పలువురు ఎంపీటీసీలు సర్పంచులు అడిగిన ప్రశ్నలకు అధికారులు సమాధానాలు ఇచ్చారు. వారి నివేదికలను సమర్పించారు. ఐసిడిఎస్, వైకేపి, ఉపాధి హామీ, పోలీసు, వైద్య ఆరోగ్యశాఖ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు. జడ్పిటిసి సుకల రమణమ్మ మండలంలో హార్టికల్చర్ ద్వారా మొక్కల పంపిణీ కార్యక్రమం చేపట్టాలని కోరారు. గ్రామపంచాయతీలో బోర్లు మరమ్మతులకు అవసరమయ్యే సామగ్రిని ఉంచాలని సర్పంచులు కోరారు. వైస్ ఎంపీపీలు ఇన్నం రత్నం, కూంద్రపు తాతబాబు, తహసిల్దార్ అన్నాజీ రావు, కార్యాలయ పరిపాలన అధికారి రమణబాబు తదితరులు పాల్గొన్నారు.


# చిగుళ్ళ వ్యాధిని అశ్రద్ధ చేయవద్దు

## గీతం దంత కళాశాల ఆస్పత్రి నిపుణుల సూచన



సాగర్‌నగర్ **(విజయభాను న్యూస్) :** శరీరానికి శక్తిని ఇచ్చే విధంగా వివిధ ఆహార పదార్థాలను నమిలి జీర్ణం కావడానికి సహకరించే దంతాల పట్ల ముఖ్యంగా నోటి ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా వ్యవహరించాలని చిగుళ్ళవ్యాధి వంటి వాటిని అసలు అశ్రద్ధ చేయివద్దని గీతం దంత వైద్య కళాశాల, ఆస్పత్రి వైద్య నిపుణులు సూచించారు. నోటి పరిశుభ్రత దినోత్సవం సందర్భంగా మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఆస్పత్రి పెరియోడాంటిక్స్ విభాగం అధిపతి డాక్టర్ డి.త్రినాధ్ కిషోర్ మాట్లాడుతూ చిగుళ్ళలో నొప్పి, రక్తస్రావం, దంతాల మధ్య ఖాళీలు ఏర్పడటం, నోటి దుర్వాసన, దంతాలలో ఆహార పదార్థాలు ఇరుక్కుని ఉండటం సాధారణ దంత సమస్యలని పేర్కొన్నారు. ఆయా సందర్భాలలో తక్షణమే దంత వైద్యులను సంప్రదించి చికిత్స తీసుకోవాలన్నారు. నోటిలోకి బ్యాక్టీరియా చేరడంవల్ల చిగుళ్ళు వాచి ఎర్రటి రంగులోకి మారడం, బ్రష్ చేసుకునే సమయంలో రక్తం కారడం జరుగుతుందన్నారు. వీటి తీవ్రత పెరిగితే చిగుళ్ళతో ఉండే దంతాలు, వాటి ఎముకలు ఆధారాన్ని కోల్పోతాయని పేర్కొన్నారు. చిగుళ్ళ వ్యాధి తీవ్రతను బట్టి దంతవైద్యంలో "పెరియోడాంటిస్ట్" నిపుణులు ప్రత్యేక చికిత్స అందిస్తారని తద్వారా రాబోయే నష్టాన్ని అరికట్టవచ్చునన్నారు. రోజుకు రెండు సార్లు దంతాలను శుభ్రం చేసుకోవడం, ప్రతి ఆరు నెలలకు దంతవైద్యుని సంప్రదించడం ద్వారా నోటి ఆరోగ్యాన్ని సురక్షించుకోవచ్చునని తెలిపారు. తీపి పదార్థాలకు దూరంగా ఉండటం చేయాలన్నారు. కార్యక్రమానికి గీతం దంత కళాశాల ఆసుపత్రి ప్రిన్సిపాల్ డాక్టర్ విజయరామరాజు అధ్యక్షత వహించి నోటి ఆరోగ్యం ప్రాధాన్యతను వివరించారు.

# గీతంలో తల్లి పాల వారోత్సవాలు ప్రారంభం




సాగర్‌నగర్ **(విజయభాను న్యూస్) :** ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి తల్లి పాలు అత్యంత ఉపయోగకరంగా నిలుస్తాయని ఈ దృష్ట్యా తల్లి పాల సంస్కృతిని ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాలని గీతం విశ్వవిద్యాలయం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్ అండ్ రీసెర్చ్ (జిమ్సర్) ఆస్పత్రి ప్రాంగణంలో తల్లి పాల వారోత్సవాల సందర్భంగా మంగళవారం తేది :01-08-2023న స్కూల్ ఆఫ్ నర్సింగ్ ప్రిన్సిపాల్ డాక్టర్ టి.లక్ష్మమ్మ తల్లి పాల వారోత్సవాలను ప్రారంబించారు. బిడ్డ పుట్టిన తరువాత తల్లి నుంచి మూడు రోజుల పాటు అందే తల్లి పాలు చిక్కగా పోషక పదార్థాలతో ఉంటాయని వీటిని అందించటం తప్పనిసరి అని అన్నారు. తల్లి పాల వల్ల రోగ నిరోధక శక్తి పెరగటంతో పాటు జీర్ణాశయ సంబంధ సమస్యలు తక్కువగా ఉంటాయని వెల్లడించారు. ఉద్యోగం చేసేవారు సైతం తల్లి పాల సంస్కృతిని విడనాడకుండా కొనసాగించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో గీతం ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎ.శ్రీనివాస్, గీతం స్కూల్ ఆఫ్ నర్సింగ్ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ మాలతి, మెడికల్ సూపరెంటెండెంట్ రామాంజనేయులు, జ్యోతిరాణి, సైన్స్ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ సురేష్‌కుమార్ తరితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నర్సింగ్ విద్యార్థులు తల్లిపాల ప్రాధాన్యతను తెలిపే స్కిట్‌లను ప్రదర్శించారు.

# మరియమాత మోక్షారోపణ మహోత్సవాలు ప్రారంభం



విశాఖపట్నం, **(విజయభాను న్యూస్) :** జ్ఞానాపురం దరి పునీత పేతురు ప్రధాన దేవాలయం ఆధ్వర్యంలో మరియమాత మోక్షారో పణ మహోత్సవాలు ఆగస్టు 1వ తేదీ నుంచి ప్రారంభమవుతాయని దేవాలయ విచారణకర్త ఫాదర్ జొన్నాడ జాన్ ప్రకాష్ తెలిపారు. ఈ మేరకు శనివారం స్థానిక ఆలయ ప్రధాన కార్యాల యంలో ఉత్సవాల గోడపత్రికను ఆవిష్కరించారు.

1900 సంవత్సరంలో జ్ఞానాపురంలోని ప్రజలు కలరా వ్యాధితో మరణించగా కీర్తిశేషులు బిషప్ రోసియోనో గ్రామాన్ని దేవ మాతకు సమర్పించి ప్రార్థన చేయగా. అద్భుతంగా కలరా వ్యాధి కనుమరుగయిందన్నారు. ఈ అద్భుతాన్ని పురస్కరించుకుని ఆనాటి నుండి నేటి వరకు జ్ఞానాపురంలో ప్రతి సంవత్సరం ఆగస్టు నెల 1 వ తేదీ నుంచి మరియమాత స్వరూప తేరును 14 రోజులపాటు ఊరేగించి 15వ తేదీన మహోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు. ఆగస్టు 1న చర్చిలో దివ్య పూజ అనంతరం సాయంత్రం 7.30 గంటలకు సిలువ గుర్తు మండపంలో మహోత్సవ జెండా ఆవిష్కరణతో కార్యక్రమాలు ప్రారంభ మవుతాయన్నారు. మంగళవారం నుంచి 14వ తేదీ వరకు జ్ఞానాపుర వీధుల్లో మరియమాత

స్వరూప తేరును ఊరేగించనున్నట్లు తెలిపారు. 6వ తేదీ సాయంత్రం 6.30 గంటల నుంచి 14వ తేదీ వరకు దేవాలయంలో నవదిన ప్రార్థనలు జరుగుతాయన్నారు. 15వ మహోత్సవ సమిష్టి దివ్య పూజబలిని విశాఖ అగ్రపీఠాధిపతి డాక్టర్ మల్లవరపు ప్రకాశ్ నిర్వ హిస్తారని వెల్లడించారు. కార్యక్రమంలో పునీత పేతురు ప్రధాన దేవాలయ సహాయ-విచారణకర్తలు ఫాదర్ పి ప్రభాకర్, కే వేళాంగిణి రాజు

పీపీసీ అధ్యక్షుడు యర్ర ఆమర్ప్, కార్యదర్శి పి. ఆనంద్, కోశాధికారి జి. ఆనందారావు, ఉపాధ్యక్షుడు ఆదిరెడ్డి చార్లీ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఓటరు సర్వేకు అందరూ సహకరించండి

రాజాం (విజయభాను న్యూస్) : ఓటరు సర్వేకు ప్రతీ ఒక్కరు సహకరించాలని రాజాం నియోజకవర్గ ఎన్నికల అధికారిణి కె. పద్మలత కోరారు. మంగళవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద రాజాం మండలంలొని పలు రాజకీయ పార్టీల నేతలతో సమీక్షించారు. ఈసందర్భంగా ఓటరు సర్వేకు సంబంధించి పలు అంశాలను వెల్లడించారు. సర్వే జరుగుతున్న సమయంలో బీఎల్ఓలు వద్ద ఉండి,. ఎటువంటి అభ్యంతరాలు ఉన్న తెలియజేయాలని కోరారు. ఈకార్యక్రమంలో తహశీల్దార్ ఎస్ కే రాజు, ఎన్నికల డీటీ ప్రకాష్ రాజు, బీఎల్ఓలు, పలు పార్టీల నేతలు పాల్గొన్నారు

# విజయభాను సంపాదకీయం

## గ్రామ స్థాయి నుండే పజాస్వామ్య స్ఫూర్తి

గ్రామ స్థాయి నుండే పజాస్వామ్య స్ఫూర్తి పరిఢవిల్లాలని రాజ్యాంగ నిర్మాతలు భావించారు. అందుకే రాజ్యాంగంలోని నలభయ్యవ అధికరణంలో స్థానిక స్వపరిపాలన ప్రాముఖ్యతను గురించి పేర్కొన్నారు. పశ్చిమ బెంగాల్, కేరళ, త్రిపుర రాష్ట్రాల్లో మినహా దాదాపు అన్ని రాష్ట్రాల్లో పంచాయతీ వ్యవస్థను పాలకులు నిర్వీర్యం చేస్తూ వచ్చారు. వాటికి నిధులు, విధులు కేటాయించకుండా ఉత్సవ విగ్రహాలుగా మార్చారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన వాలంటీర్ వ్యవస్థ పంచాయతీలను మరింత బలహీనం చేసింది. ప్రభుత్వ పథకాలు, సేవలు ప్రజలకు అందించేందుకు ఏర్పాటు చేసిన వాలంటీర్ వ్యవస్థ సకాలంలో పింఛన్ల పంపిణీ, ప్రభుత్వ పథకాలకు దరఖాస్తు చేసుకోవడానికి కొంత తోడ్పడింది. అయితే ఎన్నికైన గ్రామ ప్రజా ప్రతినిధుల ప్రాధాన్యతను పూర్తిగా తగ్గించివేసింది. మరోవైపు పంచాయతీలకు రావాల్సిన నిధులను రాష్ట్ర ప్రభుత్వం వివిధ పథకాలకు మళ్ళించుకుంటుంది. అందువల్ల పంచాయతీలు తమ కనీస విధులను నిర్వహించలేకపోతున్నాయి. కీలకమైన విషయాన్ని వదిలేసి సమస్యలన్నింటికీ వాలంటీర్లు మూలమైనట్లు, మహిళల అదృశ్యానికి వీరే కారణమైనట్లు జనసేన నేత మాట్లాడడం, వాలంటీర్లు వైసిపి ఏజెంట్లు అంటూ ప్రచారం చేస్తున్న టిడిపి నేతలు తాము అధికారంలోకి వస్తే వాలంటీర్ వ్యవస్థను రద్దు చేయబోమని చెప్పడం ద్వారా ఇప్పుడున్న వారిని తొలగించి తమ వారిని నియమించుకుంటామనే అర్థంలో మాట్లాడుతున్నారు. పార్లమెంటరీ ప్రజాస్వామ్య మనుగడలో పంచాయతీ వ్యవస్థ స్ఫూర్తి, దాని పురోగతి అత్యంత కీలకమనే విషయాన్ని పాలక పార్టీలు ఉద్దేశ్యపూర్వకంగానే నిర్లక్ష్యం చేస్తున్నాయి. పంచాయతీ వ్యవస్థ ఆవిర్భావం

స్వాతంత్ర్యం తర్వాత భారతదేశంలో పార్లమెంట్, రాష్ట్ర శాసనసభలు, జిల్లా బోర్డులు అనే మూడంచల పాలన వ్యవస్థ ఏర్పడింది. గ్రామ పరిపాలన ప్రాధాన్యత గురించి మొదటి పార్లమెంట్ సమావేశాల్లోనే కమ్యూనిస్టులు లేవనెత్తారు. దేశంలో వివిధ ప్రాంతాల్లో ముఖ్యంగా తెలంగాణలో జరిగిన రైతాంగ సాయుధ పోరాటం ద్వారా ఏర్పడిన గ్రామస్వరాజ్య విధానం పాలకులు గ్రామ పరిపాలన అమలు చేసేటట్లు ఒత్తిడి చేసాయి. బల్వంతరారు మెహతా ఆధ్వర్యాన పంచాయతీరాజ్ వ్యవస్థ పరిశీలన కోసం కమిటీ ఏర్పడింది. ఈ కమిటీ సిఫార్సులతో 1959లో పంచాయతీ వ్యవస్థ ఏర్పడింది. దేశంలో మొట్టమొదటిసారి ఆంధ్రప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాల్లో అలాంటి పంచాయతీ వ్యవస్థను ఏర్పాటు చేశారు. దీని ద్వారా పంచాయతీలు, పంచాయతీ సమితులు, జిల్లా పరిషత్తులు ఏర్పడ్డాయి. తెలుగు ప్రజలు గతంలో కొంత భాగం మద్రాసు రాష్ట్రంలో, మరికొంత నిజాం ప్రభుత్వంలో వుండడం వల్ల ఈ రెండు ప్రాంతాలకు రెండు పంచాయతీ చట్టాలు వుండేవి. మద్రాసు గ్రామ పంచాయతీ చట్టం- 1950, హైదరాబాద్ గ్రామ పంచాయతీ చట్టం- 1956 లను 1964లో రద్దు చేసి ఆంధ్రప్రదేశ్ గ్రామ పంచాయతీ చట్టం ఏర్పడింది. ఆ తర్వాత కొంత కాలానికి పంచాయతీ సమితులు, గ్రామ పంచాయతీల పనితీరు పరిశీలించిన అశోక్ మెహతా కమిటీ 1978లో తన సిఫార్సులు చేసింది. దాని ఫలితంగా 1986లో 330 పంచాయతీ సమితుల స్థానంలో 1096 మండల పరిషత్తులు ఏర్పడ్డాయి.

దేశవ్యాపితంగా స్థానిక స్వపరిపాలన పటిష్టంగా అమలు చేయడం కోసం 73, 74 రాజ్యాంగ సవరణల ద్వారా రాజ్యాంగంలో 9, 9ఎ విభాగాలను అదనంగా చేర్చారు. 11వ షెడ్యూల్ ద్వారా 29 అంశాలు నిర్వహించడానికి గ్రామ పంచాయతీలకు పూర్తి అధికారాలు ఇచ్చారు. దీనిద్వారా ప్రజలకు అవసరమైన ప్రాథమిక, కనీస సదుపాయాలు కల్పించడం, వాటిని నిర్వహించడం పంచాయతీల పరిధిలోకి వచ్చింది. గ్రామీణ వ్యవస్థ లోని భూస్వాములు, ధనిక రైతాంగం పంచాయతీ ఎన్నికలు జరగకుండా, తమ పెత్తనాన్ని కొనసాగించుకునేందుకు మొదటి నుండి ప్రయత్నించారు. అయితే సిపిఎం నాయకత్వంలో బెంగాల్, కేరళ, త్రిపుర రాష్ట్రాల్లో ఏర్పడిన వామపక్ష ప్రభుత్వాలు పంచాయతీల ఎన్నికలకు, వాటి నిర్వహణకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చాయి. గ్రామ సభలు నిరంతరం జరపడం ద్వారా స్థానిక ప్రజా ప్రతినిధులకు పాలనలో నిజమైన భాగస్వామ్యం కల్పించారు. అందులో ప్రభుత్వ పథకాలకు అర్హుల ఎంపిక, అభివృద్ధి ప్రణాళికలు రూపొందించడం, ప్రతి ఐదు సంవత్సరాలకు క్రమం తప్పకుండా ఎన్నికలు నిర్వహించడం జరిగింది. ఆ రాష్ట్రాల బడ్జెట్ నుండి గ్రామ పంచాయతీలకు 30 నుండి 37 శాతం నిధులు కేటాయించేవారు. ఈ నిధులను గ్రామ పంచాయతీలకు బదిలీ చేయడం, వాటి ద్వారా ప్రజా సేవ, అభివృద్ధి కార్యక్రమాలను నిర్వహించడం ద్వారా ఆదర్శవంతమైన గ్రామపాలన అందించారు. అందుకే ఈ రాష్ట్రాల పంచాయతీలు దేశంలోనే కాదు ప్రపంచ మన్ననలు పొందాయి. ఈ నేపథ్యంలోనే పంచాయతీ ఎన్నికలు నిర్దిష్ట గడువులో నిర్వహిస్తేనే కేంద్రం నిధులు విడుదల చేసే విధంగా నిబంధనలు మార్చాల్సి వచ్చింది. మంచి లక్ష్యంతో ఏర్పడిన పంచాయతీ రాజ్ వ్యవస్థ ప్రారంభం నుండి విధులు, నిధుల కొరతను ఎదుర్కోవలసి వచ్చింది.

# ఉన్నత అధికారులు దృష్టికి గుమ్మకోట గురుకుల పాఠశాల సమస్యలు



అనంతగిరి విజయభాను న్యూస్ : పాఠశాలను సందర్శించి సమస్యలను తెలుసుకున్న ఎంపీపీ శెట్టి నీలవేణి అనంతగిరి, ఎంపీపీ సోషల్ మీడియాలిబీ మండలంలోని గుమ్మకోట గురుకుల పాఠశాలలో నెలకొన్న సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుని వెళ్లి వాటి పరిష్కారానికి తన వంతు కృషిని అందిస్తానని ఎంపీపీ శ్రీమతి లిశెట్టి నీలవేణిలి హామీ ఇచ్చారు. ఆమె స్థానిక సర్పంచ్ పాగి అప్పారావు, ఎంపీటీసీ సిరగం అశోక్, కో ఆప్షన్స్ సభ్యుడు షేక్ మదీనా తదితరులతో కలిసి మంగళవారం గురుకుల పాఠశాలలను పరిశీలించారు. ముందుగా విద్యార్థులకు అందిస్తున్న ఆహారాన్ని మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాలలో ముందస్తు పోలిస్తే నిర్వహణ బాగుందని ఆమె పేర్కొన్నారు. పాఠశాలలో సుమారు 500 మందికి పైగా విద్యార్థులు ఉండగా డార్మెటరీ పూర్తిస్థాయిలో అందుబాటులో లేదని దానివల్ల తరగతి గదుల్లోనే విద్యార్థులు రాత్రి వేళలో పడుకోవాల్సిన పరిస్థితి నెలకొంది ఉందని విద్యార్థులు ఆమె దృష్టికి తీసుకొని వెళ్లారు. అదేవిధంగా అదనంగా బోరు మంజూరు చేయాలని, పాఠశాల చుట్టూ ప్రహరీ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని, క్రీడా మైదానాన్ని అభివృద్ధి పరచాలని ప్రిన్సిపల్ లక్ష్మణ్ మూర్తి అన్నారు. ఎంజిఎన్ఆర్ఇజిఎస్ ద్వారా క్రీడా మైదానాన్ని అభివృద్ధి పరిచేందుకు చర్యలు తీసుకుంటామని అదే విధంగా పాఠశాలలో నెలకొన్న సమస్యలను ఉన్నత అధికారుల దృష్టికి తీసుకొని వెళ్లి వాటిని పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటామని ఆమె హామీ ఇచ్చారు.

పాఠశాలలో బోధన సిబ్బంది తదితర వివరాలను ఎంపీపీ ప్రిన్సిపల్ ను అడిగి తెలుసుకున్నారు.

చక్కని విద్యా బోధన అందించి గురుకుల పాఠశాల పై మరింత నమ్మకాన్ని పెంచే విధంగా కృషి చేయాలని సూచించారు. అనంతరం గుమ్మకోట పంచాయతీ దబ్బలపాడు గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను సందర్శించి అక్కడ విద్య బోధనపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఉప సర్పంచ్ కన్నయ్య ,వార్డు సభ్యులు పార్టీ నాయకులు పాల్గొన్నారు.



## భవిత సెంటర్ ను సందర్శించిన శకుంతల




పరవాడ:-జిల్లా సహిత విద్య సమన్వయకర్త బి.శకుంతల మంగళవారం పరవాడ భవిత సెంటర్ ని సందర్శించడం జరిగింది. భవిత సెంటర్లో ఉన్న దివ్యాంగ విద్యార్థులతో సంభాషించడం జరిగింది. భవిత సెంటర్ లో ఉన్న రిజిస్టర్స్, రికార్డ్స్ చెక్ చేయడం జరిగింది. ఎస్ ఎస్ ఏ ద్వారా దివ్యాంగ విద్యార్థులకు అందిస్తున్న అలవెన్స్ వివరాలు గురించి అడిగి తెలుసుకుని సంతృప్తిని వ్యక్తం చేస్తూ, దివ్యాంగ విద్యార్థులు కనబరుస్తున్న ప్రతిభను చూసి విద్యార్థులను, దివ్యాంగ విద్యార్థులకు బోధిస్తున్న ఐ ఇ ఆర్ పి లైన టీ . కుమారి, జీ . శ్రీనివాసులను కొనియాడారు. మండలంలో జరుగుతున్న దివ్యాంగ విద్యార్థుల సర్వే గురించి కూడా శ్రీమతి బి. శకుంతల గారు అడిగి తెలుసుకున్నారు. భవిత సెంటర్ లో ఉన్న టీ ఏ ల్ ఎం ను చూసి, బాగుందని తెలియజేస్తూ దివ్యాంగ విద్యార్థులకు ఎలా బోధిస్తున్నారో గమనించి, సంతృప్తి వ్యక్తం చేశారు. భవిత సెంటర్లో అమలపరుస్తున్న సహిత విద్యా కృత్యాల పట్ల సంతృప్తిని వ్యక్తం చేస్తూ, దివ్యాంగ విద్యార్థులు ఆటపాటలలో, సహిత విద్యా కృత్యాలలో చురుకుగా ఉండడం చూసి దివ్యాంగు చిన్నారులని అభినందించడం జరిగింది.

## సమయం కవి

### శ్రీకృష్ణ దేవుడు

అదిగదిగో దేవుడు
శ్రీ కృష్ణ దేవుడు
సర్వ మంతా వున్నాడు.
పరమాత్ముని తలచుటయే పుణ్యమైన దినమని
ప్రతి దినము పరమావది మీరని
గోవర్ధన గిరినెత్తి-భయమన్నది పోగొట్టి
వెతలు మోత మోసిరి- ప్రజలు చెంత నిలిచిరి
క్షణమంత పిలుపుతో - సాయమెంతో వుందని
శ్రమజీవన సాధనలో - సర్వజీవ రాసివి;
కొరత లేని జీవనం - ప్రతి ప్రాణికి ప్రాప్తివి.
పాడగా పాటయందు
ఆడగా ఆటయందు
పనిపాటులు యందును
చిత్తం, శరణం అనుకొని
లేనిదంటు తీరెను
ఉన్నదెంతో యిచ్చెను
విశ్వమంత దివ్యము - దివ్యమైన తేజము.

కవిత రచన :
మజ్జి శ్యామసుందరరావు

## పవన్ సాయి మల్టీస్పెషల్టి ఆస్పత్రి సేవలు అభినందనీయం

కలపాక సర్పంచ్ బండారు కల్పన రాజశేఖర్



పరవాడ : పవన్ సాయి మల్టీస్పెషల్టి ఆసుపత్రి సేవలు అభినందనీయమని పి బోర్డింగ్ సర్పంచ్ బండారు కల్పనా రాజశేఖర పేర్కొన్నారు... మంగళవారం పరవాడ మండలం పి బోనంగి పంచాయతీ పరిధిలో పవన్ సాయి మల్టీస్పెషల్టి హాస్పటల్ ఎండి రామారావు ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు.. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా స్థానిక సర్పంచ్ బండారు కల్పన రాజశేఖర హాజరై ఆయన చేతుల మీదుగా ప్రారంభించారు.. వైద్యాధికారి ప్రియదర్శిని జ్వరాలు బీపీ షుగర్ వంటి అన్ని రకాల వ్యాధులకు ఉచిత పరీక్షలు నిర్వహించి వాటికి తగ్గ మందులను పంపిణీ చేశారు.. ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది.. ఈ శిబిరాన్ని పి. బోనంగి లో నిర్వహించినందుకు గాను సర్పంచ్ హాస్పిటల్ ఎండి రామారావుకు కృతజ్ఞతలు తెలియపరిచారు... ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ డెక్క శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మండల టిడిపి కార్యదర్శి ఇందల జన్మదిన వేడుకలు



పరవాడ : టిడిపి మండల ప్రధాన కార్యదర్శి ఇందుల కొండలరావు జన్మదిన వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి.. ముందుగా కార్యకర్తలు నాయకులు మధ్య ఆయన కేక్ కట్ చేసి పంచి పెట్టారు. దీంట్లో భాగంగారాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి అట్టా సన్యాసి అప్పారావు, జిల్లా రైతు కమిటీ సభ్యులు జనపాల రాము, జిల్లా టిఎన్టిఈసి ఆర్గనైజింగ్ సెక్రటరీ గొర్లి శ్రీనివాసరావు, పరవాడ గ్రామ తెలి యువత అధ్యక్షులు గండి మహేష్ తదితరులు ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలియపరిచారు... ఈ సందర్భంగా అట్ట సన్యాసప్పారావు మాట్లాడుతూ ఇందులో కొండలరావు ఇటువంటి జన్మదినం వేడుకలు మరిన్ని జరుపుకోవాలని ఆయన ఆకాంక్షించారు...

# మారనున్న విశాఖ రూపురేఖలు....




స్థలానికిగాను... 12-13 ఎకరాల పెద్ద విస్తీర్ణంలో మాల్ రావడం అన్నది కొన్ని చోట్లే ఉంటుంది. ఇదే రహేజా గ్రూపు హైదరాబాద్లో ఇనార్బిట్ మాల్ను 7-8 ఎకరాల్లోనే కడితే మనం 12-13 ఎకరాల విస్తీర్ణంతో పెద్ద మాల్కు ఇక్కడ శంకుస్థాపన చేసుకున్నాం. ఈ కార్యక్రమాన్ని సాధ్యమయ్యేలా చేసిన నీల్ రహేజాకు, సీఈఓ రజనీష్ మహాజన్కు, సీఓఓ శ్రావణ్ కుమార్తో పాటు మిగిలిన అందరికీ రాష్ట్ర ప్రభుత్వం తరపున, నా తరపున హృదయపూర్వక కృతజ్ఞతలు.

**మారనున్న విశాఖ రూపురేఖలు....**

ఈ రోజు ఇక్కడ కడుతున్న మాల్ నిర్మాణం ద్వారా విశాఖపట్నం రూపురేఖలు మారడమే కాకుండా... దక్షిణ భారతదేశంలోనే పెద్ద మాల్ కానుంది. రూ.600 కోట్ల పెట్టుబడితో ఇంత పెద్ద విస్తీర్ణంలో మాల్ నిర్మాణం వల్ల... 8వేల మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉద్యోగాలు లభిస్తాయి. ఫేజ్ -2లో ఐటీ స్పేస్, ఇంటర్నేషనల్ కన్వెన్షన్ సెంటర్. 12 నుంచి 13 ఎకరాల్లో మాల్ నిర్మాణం పూర్తయిన తర్వాత.... మిగిలిన భూమిలో రాబోయే రోజుల్లో రెండో దశ ప్రాజెక్టులో భాగంగా ఇక్కడ రెండున్నర లక్షల ఎస్ఎఫ్టీతో ఐటీ స్పేస్ కూడా రాబోతుంది. అంతర్జాతీయ స్థాయిలో ఒక కన్వెన్షన్ సెంటర్ను కూడా నిర్మించనున్నారు. వీటన్నింటి ద్వారా ఇంకా ఉద్యోగఅవకాశాలు మెరుగవుతాయి. 2.50 లక్షల ఎస్ఎఫ్టితో ఐటీ స్పేస్ రావడం వల్ల మరో 3,000 మందికి ఉద్యోగ అవకాశాలు కూడా రానున్నాయి. ఇవన్నీ రాబోయో రోజుల్లో విశాఖపట్టణాన్ని అంతర్జాతీయ స్థాయిలో నిలబెట్టే కార్యక్రమాలు.

ఇంతకముందు వచ్చినప్పుడు ఆదానీ గ్రూపు ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న డేటాపార్కు, ఐటీ స్పేస్కు శంకుస్థాపన చేసుకున్నాం. అదే రోజు భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయ పనులకు కూడా శంకుస్థాపన చేశాం. అంతకన్నా ముందు శ్రీకాకుళంలో ఉత్తరాంధ్ర రూపురేఖలు మార్చే విధంగా మూలపేటలో పోర్టు నిర్మాణానికి శంకుస్థాపన చేసుకున్నాం. ఇవన్నీ ఉత్తరాంధ్రా అభివృద్ధి రూపురేఖలను మార్చే గొప్ప అడుగులు. ఇనార్బిట్ మాల్ కూడా అలాంటిదే. ఇవి కాకుండా రహేజా గ్రూపు దేశంలో పలుచోట్ల ఫైవ్ స్టార్ హోటళ్లు కట్టారు. అదే మాదిరిగా మన రాష్ట్రంలో రాజ్విలాస్ తరహాలో సూపర్ లగ్జరీ ఫైవ్స్టార్ ప్లస్, సెవెన్ స్టార్ హోటల్ కట్టబోతున్నారు. ఇప్పటికే ఒబెరాయ్, మేపెయిర్ హోటల్స్ గ్రూపు వాళ్లు కూడా కడుతున్నారు. ఆ తరహాలో రహేజా గ్రూపు కూడా సెవెన్ స్టార్ లగ్జరీ రిసార్ట నిర్మాణంలో మూడో గ్రూపు కానుంది. ఇవన్నీ విశాఖలో గొప్ప ప్రాజెక్టులుగా నిలుస్తాయి. అదే విధంగా హిందూపూర్లో కూడా 350 ఎకరాల్లో ఎలక్ట్రానిక్స్, టెక్స్టైల్స్కు సంబంధించిన పార్కు రాబోతుంది. దానివల్ల మరో 15వేల ఉద్యోగాలు వచ్చే అవకాశం ఉందని చెప్పారు. ఆ ప్రాజెక్టుకు కూడా అడుగులు ముందుకు వేశాము... యుద్ధ ప్రాతిపదికన అది కూడా టేకప్ చేస్తామన్నారు.

# ఘనంగా ప్రేమ సమాజం అధ్యక్షులు శివాజీ జన్మ దినోత్సవ వేడుకలు..



విశాఖపట్నం, ఆగస్టు 1: సమాజానికి సేవ చేయాలనే దృక్పథంతో శివాజీ ప్రేమ సమాజంలో అనాధలు పిల్లల మధ్య జన్మదిన వేడుకలు జరుపుకోవడం అభినందించదగ్గ విషయమని అనకాపల్లి మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ కొనియాడారు. నగరంలోని ప్రేమ సమాజంలో మంగళవారం సాయంత్రం సమాజం నూతన అధ్యక్షులు బుద్ధ శివాజీ జన్మదినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. వేడుకలకు ముఖ్య అతిథిగా విచ్చేసిన గోవింద్ సత్యనారాయణ మాట్లాడుతూ ఎటువంటి పదవి లేకుండా సమాజానికి మొదట నుండి శివాజీ పలు సేవా కార్యక్రమాలు చేస్తున్నరన్నారు. బుద్ధ శివాజీ తన సేవా కార్యక్రమాలతో అందరికీ ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. రైటర్స్ అకాడమీ చైర్మన్ వివి రమణమూర్తి మాట్లాడుతూ

శివాజీ తన ప్రతి జన్మదినం ప్రేమ సమాజంలో జరుపుకుంటూ, ప్రేమ సమాజం ప్రేమ కోసం నిరంతరం తపిస్తుంటారని అన్నారు. సహాయానికి ముందుండే వ్యక్తి శివాజీ అన్నారు. శివాజీ, అతని కుటుంబంతో తనకు ఎంతో కాలంగా అనుబంధం ఉందని, ఎన్నో పదవులు వరించిన, సున్నితంగా బయటికి వచ్చారని తెలిపారు. ప్రేమ సమాజం అధ్యక్ష పదవికి ఆహ్వానిస్తే సేవా దృక్పథంతో బాధ్యతలు చేపట్టి, సమాజానికి సేవ చేస్తున్నారని కొనియాడారు. అన్ని రకాల వంటలతో ప్రేమ సమాజంలో ఉన్నవారికి భోజనం పెట్టాలని కలలు గని, అది నెరవేరుస్తున్నారని కొనియాడారు. ప్రేమ సమాజంలో అనాధలు, పిల్లల మధ్య జన్మదినము జరుపుకోవాలని ఆకాంక్షం ఉన్న వ్యక్తి శివాజీ అన్నారు. సోషల్ మీడియాలో కూడా శివాజీకి మంచి గుర్తింపు ఉందని చెప్పారు. నిండు నూరేళ్లు ఆరోగ్యంతో ఉండి సమాజానికి మరింత సేవలు శివాజీ చేయాలని ఆకాంక్షించారు.

ఎండోమెంట్ అధికారి శిరీష మాట్లాడుతూ

ప్రేమ సమాజంలో ఎన్నో సేవా కార్యక్రమాలు ఉన్నాయని, సేవా తత్పురుడు శివాజీ జన్మదిన వేడుకలకు తాను పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. పలు సేవలు చేస్తున్న శివాజీ ప్రేమ సమాజం అధ్యక్షుడిగా రావడం గొప్ప విషయం అన్నారు. సమాజం నూతన అధ్యక్షులు బుద్ధ శివాజీ మాట్లాడుతూ తన సేవా కార్యక్రమాలు నిరంతరం ఉంటాయన్నారు.

తన జన్మదిన వేడుకలకు ఇంతమంది పెద్దలు విచ్చేసి ఆశీర్వదించడం పూర్వజన్మ సుకృతమన్నారు.

ఈ సందర్భంగా పలువురు అతిథులు, ప్రముఖులు, తదితరులు శివాజీకి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

సభాధ్యక్షులు విశ్వేశ్వరరావు నేతృతంలో జరిగిన ఈ వేడుకల్లో అనకాపల్లి మాజీ ఎమ్మెల్యే పీలా గోవిందు, , టిడిపి జివిఎంసి ఫ్లోర్ లీడర్ పీలా శ్రీనివాసరావు, ప్రేమ సమాజం సెక్రటరీ హరిమోహన్, నరసింహమూర్తి, ఆడారి లచ్చప్పారావు, మల్ల బలరాం, మల్ల రాంప్రసాద్, వేగి సత్యనారాయణ, బొడ్డ అప్పారావు, కొణతాల శ్రీను, ఎస్ ఎస్ నారాయణ, ప్రేమ సమాజం కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



విశాఖపట్నం, విశాఖ ఉత్తర నియోజకవర్గం కైలాసపురం, పోర్టు క్వార్టర్స్ సముదాయంలో రహేజా గ్రూప్ ఆధ్వర్యంలో నిర్మించ నున్న ఇనార్బిట్ మాల్ భూమి పూజ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీఎం వైయస్ జగన్మోహన్ రెడ్డి విచ్చేసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ప్రాంగణంలో ఉన్న వికె పిసిపిఐఆర్ యుడిఎ ఛైర్పర్సన్ చొక్కాకుల లక్ష్మి వెంకటరావు దంపతులను బాగున్నావా వెంకటన్న అని ఆప్యాయంగా పలకరించిన ముఖ్యమంత్రి జగన్.

## అమెరికా ఇండియన్ ఫౌండేషన్, ICDC, హెల్త్ స్టాప్ ఆధ్వర్యంలో తల్లిపాలు వారోత్సవాలు



అనంతగిరి విజయభాను న్యూస్ : అల్లూరి సీతారామరాజు జిల్లా,లుంగపర్తి గ్రామంలో తల్లిపాలు వారోత్సవాల కార్యక్రమం చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో అధ్యక్షులుగా Dr మంజు భార్గవి గారు మేడం 7,8,9, నెలలు గర్భవతులకు, పుట్టిన వెంటనే ముర్రుపాలు ఇవ్వాలి, అని మురుపాలు యొక్క ముఖ్య ఉద్దేశం చెప్పడం జరిగినది, Dr మేడం గారు, గర్భవతులకు బాలింతలకు, వాటి యొక్క లాభాలు నష్టాలు చెప్పడం జరిగినది,అలాగే ఆరు నెలలు లోపు ఉన్న తల్లులకు, కేవలము తల్లిపాలు మాత్రమే ఇవ్వాలి, అని తల్లులకు అవగాహన కల్పించడం జరిగినది, మరియు గ్రామంలో నినాదాలు పలుకుతూ ర్యాలీ చేయడం జరిగినది, ఈ యొక్క కార్యక్రమంలో, డాక్టర్ మేడం మంజు భార్గవి , హెల్త్ సూపర్వైజర్, సంజీవరావు, HV మేడం, P.V. లక్ష్మి, మాస్సీ మండల్ కోఆర్డినేటర, సంపత్ కుమార్,మాస్సీ క్లస్టర్ కోఆర్డినేటర్, K.అప్పలకొండ, అంగన్వాడి టీచర్, D.సంగీత,మాస్సీ మిత్ర D. ఈశ్వరావు, మొదలైన వారు హాజరవ్వడం జరిగినది,

## కొర్రా లక్ష్మి కాఫీ కార్మిక సంఘానికి తీరని లోటు



అనంతగిరి విజయభాను న్యూస్ : అనంతగిరి మండలం ఎగువశోభ పంచాయతీ కొత్తవలస గ్రామంలో సిపిఎం పార్టీ సీనియర్ కార్యకర్త కాఫీ కార్మిక సంఘం నాయకులు కొర్రా.లక్ష్మి (50) అనారోగ్యంతో మృతి, జడ్పిటిసి దీసరి గంగరాజు పరామర్శించి కుటుంబాన్ని ఓదార్చి సంతాపం తెలిపారు. ఆమే మరణం కాఫీ కార్మిక సంఘానికి తీరని లోటు కాఫీ కార్మికుల పక్షాన వారి హక్కుల కోసం కూలీ రేట్లు కోసం పోరాడుతూ స్ఫూర్తిగా నిలిచినారు ఈ కార్యక్రమంలో ఎగువశోభ సర్పంచ్ కొర్రా.సింహాద్రి సిపిఎం పార్టీ శాఖ కార్యదర్శి గెమ్మెల.పెంటన్న,కిముడు.శ్రీను వైసిపి నాయకులు మజ్జి. నాగులు, కొర్రా.చిన్నయ్య కుటుంబ సభ్యులు అంత్యక్రియల్లో పాల్గొన్నారు.

## యోగాసన చాంపియన్ షిప్స్ లో విద్యార్థులు ప్రతిభ



భీమునిపట్నం : విజయభాను న్యూస్ ఈనెల 30 న విశాఖ జిల్లా యోగా స్పోర్ట్స్ అసోసియేషన్ విశాఖ ఆధ్వర్యంలో జరిగిన యోగాసన చాంపియన్ షిప్స్ ,ఇంటర్ డిస్ట్రిక్ట్ సెలక్టింగ్ ట్రయల్ పోటీలు విశాఖ సీతమ్మదారలో జరిగాయి. ఈ పోటీలలో భీమిలి,కీటిన్ పేట జె.జె పవర్ జిమ్ విద్యార్థులు పాల్గొని విజయం సాధించి రాష్ట్రస్థాయి యోగా పోటీలకు ఎన్నికయి నట్లు నేషనల్ యోగా రిఫరీ ఫిట్నెస్ ట్రైనర్ నల్లా శ్రీనివాస్ తెలిపారు. వీరు సెప్టెంబర్ లో కర్నూలు లో జరగబోయే రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొంటారనీ చెప్పారు

### ప్రజలు నిత్యం ఉపయోగించే నిత్యావసర వస్తువుల

## ధరలను అదుపు చేయాలి

### టిడిపి రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు



భీమునిపట్నం : విజయభాను న్యూస్ ప్రజల అవసరాలకు.. ప్రభుత్వ తీరుకు ఎటువంటి సంబంధం లేని విధంగా రాష్ట్రంలో వైకాపా పాలన సాగుతుందని రాష్ట్ర కార్యదర్శి, గంటా నూకరాజు దుయ్యభట్టారు. నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలపై రాష్ట్రంలో ఎన్నడూ లేనివిధంగా, దేశంలో ఏ రాష్ట్రంలో లేనివిధంగా నిత్యావసర వస్తువుల ధరలు భగ్గుమంటు న్నాయని అన్నారు. ప్రజలు నిత్యం ఉపయోగించే నిత్యావసర వస్తువుల ధరలను అదుపు చేయలేని టమోటా కేజీ 180 రూపాయలు అయిందని, అల్లం - 200, పచ్చిమిర్చి కేజీ 120 రూపాయలు అయిందని అన్నారు. ఇలా బియ్యం, కందిపప్పు, కాయకూరలు అన్నింటిపై విపరీతంగా ధరలు ఆకాశాన్నంటాయని అన్నారు.

వైకాపా అధికారంలోకి వచ్చిన తరువాత రాష్ట్రంలో ఉపాధి అవకాశాలు లేక బ్రతుకుతెరువు కోసం ఇతర రాష్ట్రాల కు వలసలు వెళుతున్న పరిస్థితులు రాష్ట్రంలో ఉన్నాయని అన్నారు. ఉపాధి అవకాశాలు కల్పించక, వలసలను ఆపలేక, నిత్యావసర ధరలను అదుపు చేయలేక మరెందుకు ఈ రాష్ట్ర ప్రభుత్వం ఉందని నిలదీశారు. ప్రజా సంక్షేమం అంటే ఇదేనా అని అన్నారు.

## టిడ్కో గృహాలు లబ్ధిదారులకు అప్పగించాలి

### - సిపిఎం

అనకాపల్లి : జోన్ పరిధిలోని సత్యనారాయణపురంలో నిర్మించిన టిడ్కో గృహాలను లబ్ధిదారులకు అప్పగించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం డిమాండ్ చేశారు. సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఆర్.శంకరరావు, గంటా శ్రీరామ్, సిపిఎం సీనియర్ నాయకులు ఎ.బాలకృష్ణ, అనకాపల్లి జోన్ నాయకులు నూక అప్పారావుతో కలిసి మంగళవారం సాయంత్రం ఆయన టిడ్కో గృహాలను పరిశీలించారు. ఈ సందర్భంగా లోకనాథం మాట్లాడుతూ టిడ్కో గృహాలకు మౌలికసదుపాయాలు కల్పించి వెంటనే లబ్ధిదారులకు అప్పగించాలన్నారు. నిర్మాణాలు పూర్తయిన ఇళ్లను లబ్ధిదారులకు కేటాయించకపోవడంతో డిడిలు వెనక్కుతీసుకుంటున్నారని అన్నారు. 3096 ఫ్లాట్లను నిర్మించినా, లబ్ధిదారులకు వాటిని అప్పగించకుండా జాప్యం చేయడం సరికాదన్నారు.

## గాజువాక నియోజకవర్గం వైసీపీ పరిశీలకుడిగా సీతబాబు



గాజువాక (విజయభాను న్యూస్) : వైసిపి రాష్ట్ర సహాయ కార్యదర్శి కోటవురట్ల మండలం తంగేడుకు చెందిన రాజా సాగి దత్తుడు సీతబాబును గాజువాక నియోజకవర్గం పార్టీ పరిశీలకునిగా పార్టీ అధిష్టానం నియమించింది. ఈ మేరకు పార్టీ నుంచి నియామక పత్రం అందినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనను ఈ పదవిలో నియమించిన సీఎం జగన్కి, పార్టీ రీజినల్ కోఆర్డినేటర్ వైవి సుబ్బారెడ్డికి, ఎమ్మెల్యే బాబూరావుకు కృతజ్ఞతలు తెలిపారు.

## 72వ వార్డ్ సమస్యలు పరిష్కారానికి కృషి



గాజువాక( విజయభాను న్యూస్) : జీవీఎంసీ 72వ వార్డు సంద్రాని పాలెంలో కాలని వాసులను 72వ వార్డు ఇంచార్జ్ సిరట్ల శ్రీనివాస్(వాసు) కలసి అక్కడ వారు చెప్పిన సమస్యల పై అరా తీశారు. వాళ్లు అందరూ వినాయక ఆవాస్ అపార్ట్మెంట్ కు మున్సిపల్ వాటర్ సమకూర్చమని, రోడ్డు చాలా అద్వానంగా ఉందని,అక్కడ చెత్త అంతా అదే రోడ్డు మీద పోగు వేస్తున్నారని తదితర సమస్యలు ఆయన దృష్టికి తీసుకెళ్లగా స్పందించిన సిరట్ల శ్రీనివాస్(వాసు) వెంటనే శానిటరీ ఇన్స్పెక్టర్ ఈశ్వరరావు, సూపర్వైజర్ దేవుడు,సచివాలయం ఇమనిటీస్ సెక్రటరీ వంశీ, వాలంటీర్ కుమారి, వాటర్ వర్క్ ఇన్స్పెక్టర్ శేఖర్ ని పిలిపించి వారికి సమస్యలను వివరించి, వెను వెంటనే సమస్యల మీద తగిన చర్యలు తీసు కొనవలసినదిగా చెప్పారు. సమస్యలను అతి త్వరలో పరిష్కరిస్తామని,శాసనసభ్యులు తిప్పల నాగిరెడ్డితో మాట్లాడి రోడ్డు కూడా వేయిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో విజయ, రత్నకుమారి, రాజు, నాని, అశ్విని, విజయ, రమ్య, మణి, కావ్య, శ్యామల తదితరులు పాల్గొన్నారు.

## జె పి అగ్రహారంలో గ్రామకంఠం భూములకు యాజమాన్య హక్కులు



అచ్యుతాపురం (విజయబాను న్యూస్) : మండలంలో జె పి అగ్రహారంలో గ్రామకంఠం భూములకు భూ యాజమాన్య హక్కు పత్రాలను మంగవారం పంపిణి చేశారు . జగనన్న సంపూర్ణ భూ హక్కు భూ రక్ష పథకం కార్యక్రమంలో భాగంగా రీ సర్వే చేసి నునపర్తి గ్రామపంచాయతీ జిపి అగ్రహారం రెవెన్యూ గ్రామంలో గ్రామకంఠం భూములకు భూ యాజమాన్య హక్కు పత్రాలను గ్రామ సర్పంచ్ చుక్క అనురాధ చేతులు మీదుగా పంపిణీ చేశారు . ఈ కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ ఆంద్రా పైడిరాజు , కార్యదర్శి ఈశ్వరరావు , డెయిరీ ప్రెసిడెంట్ రెడ్డి నరసింగరావు , ఏక అప్పలరాజు , గొంప నరసింహనాయుడు , సచివాలయ కన్వీనర్ కొండ్రపు చినబాబు , వెన్నెల అప్పలనాయుడు , రెడ్డి అప్పలరాజు , వార్డు సభ్యులు బాసనబోయిన దేవి, గ్రామస్తులు పాల్గొన్నారు .

# పులిపిర్ల సమస్యకు సహజ సిద్ధమైన పరిష్కారాలు..!



హైదరాబాద్ : పులిపిర్లు సమస్య తో బాధ అంత ఇంతా కాదు. శరీరం పై అనేక ప్రాంతాల్లో వస్తుంటాయి. పెద్దగా నొప్పి లేకపోయినా వీటివల్ల ఇబ్బందులు చాలానే ఉన్నాయి. అటువంటి వాటిని సహజంగా లభించే వాటితో సులువుగా నిర్మూలించవచ్చు.

-రావి చెట్టు పై బెరడును కాల్చి బూడిద చేసి సున్నపు నీరు తేటను కలిపి నిల్వచేసుకుని తగినంత మిశ్రమంలో కొద్దిగా నెయ్యి వేసి పులిపిర్ల పై పూస్తూ ఉంటే అవి రాలిపోతాయి.

- చిటికెడు అతిమధురం పొడి,చిటికెడు అశ్వగంధ పొడి, రెండు చుక్కలు కొబ్బరి నూనె ,రెండు చుక్కలు నిమ్మరసం వేసి బాగా కలిపి అల్లంను పుల్లలగా సన్నగా కట్ చేసుకుని ఈ అల్లం పుల్లతో పై పేస్టు ను తీసుకుని పులిపిరి పై రాయాలి. అలా చేస్తే ఫలితం కనిపిస్తుంది.

-చిన్న పులిపిర్లు ఉన్నవారు అల్లం, నీరు, సున్నం సమానంగా కలిపి మెత్తగా పేస్ట్ చేసి వాటిమీద రాస్తే అవి అరిగిపోతాయి.

-పులిపిర్లు పోవాలంటే ప్రతిరోజూ కాలిప్లవర్ రసం, బంగాళా దుంప రసం, వెల్లుల్లిపాయ రసం క్రమంగా రాస్తుంటే పులిపుర్లు రాలిపోతాయి.

-కొత్త సున్నం, మంచి పసుపు కలిపి రాసుకుంటే పులిపిర్లు రాలి చర్మం శుభ్రంగా ఉంటుంది.

-పులిపిర్లు రాలిపోయిన తరువాత మచ్చపోవటానికి తేనె, నిమ్మరసం కలిపి రాయాలి.

-అరటి తొక్కను చిన్న ముక్కగా కట్ చేసి పులిరిపై అతికించి దానిపై ప్లాస్టర్ వేసి అతికించాలి. అలా రాత్రంతా ఉంచి పొద్దున్నే తీసివేయాలి.

-ఉసిరి గుజ్జును రాస్తే పులిపిరి రాలిపోతుంది. వెల్లుల్లి రసాన్ని కూడా పులిపిరిని నివారించడానికి ఉపయోగించవచ్చు.

-బొప్పాయి పాలు కూడా పులిపిరి నివారణ లో ఎంతో బాగా పనిచేస్తుంది. -అల్లం ముక్కను సున్నంలో తడిపి పులిపిరిపై పెట్టాలి. కానీ, సున్నం వాడేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలి. వీటిని నివారించడానికి శరీరాన్ని ఎప్పుడు పొడిగా ఉండనివ్వాలి. స్నానం చేసిన తరువాత శరీరాన్ని చక్కగా తుడుచుకోవాలి. తడిగా ఉన్న సాక్సులను వాడకూడదు. పులిపిర్లను గిచ్చకూడదు. కట్ చేయకూడదు ఆముదాన్ని పులిపిర్లపైనా రాస్తే ఫలితం ఉంటుంది. ఇలా తరచుగా చేయడం వల్ల పులిపిర్ల సమస్య పరిష్కారం అవుతుంది.

# బట్టతల ఉన్నవాళ్లు మందులు వాడితే ఇక అంతే!




అత్యాశకు పోతే ఉన్నది కూడా ఊడి చేతిలోకి వస్తుంది. బట్టతల వచ్చిందని ట్రీట్‌మెంట్ తీసుకుంటే అనుకోని ఆరోగ్య సమస్యలకు దారి తీస్తుంది. ముఖ్యంగా మహిళలకు బట్టతల సమస్య అంతగా బాధపెట్టదు. ఈ సమస్య పురుషుల్లోనే ఎక్కువగా ఉంటుంది. ఒత్తైన జుట్టు కోసం పురుషులు వాడే మందులు వారి లైంగిక జీవితాన్ని నాశనం చేస్తున్నాయట. ఈ విషయం ఓ అధ్యయనంలో బయట పడింది. దీని గురించి తమ వద్దకు వచ్చే పేషెంట్లకు డాక్టర్లు చెబుతున్నప్పటికీ ట్రీట్‌మెంట్ ప్రారంభించండి అంటున్నారు. వీరు వాడే మందులలో ఫినాస్టెరాయిడ్, డూటా స్టెరాయిడ్‌లు ఉంటాయని చెబుతున్నారు. వీటి కారణంగానే లైంగిక సామర్థ్యం తగ్గిపోతుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. దీని ప్రభావం కొందరిలో తాత్కాలికంగా కనిపిస్తుంది. మరికొందరిలో ప్రభావం ఎక్కువగా ఉంటుంది.

# చిన్నతనంలో ఒత్తిడికి గురైతే ఈ సమస్యలు తప్పవు!



బాల్యం ప్రతిఒక్కరికీ తీపి గురుతుగా ఉండాలి తప్ప బాధాకరంగా గడవకూడదు. చిన్నప్పటి జ్ఞాపకాలను నెమరువేసుకుంటే ముఖంలో చిరునవ్వు చిందించాలి. అలా ఉన్నవారి జీవితం అంతా ఆరోగ్యవంతంగా ఉంటారు. అంటే.. చిన్నపిల్లలు ఒత్తిడికి గురైతే వారు పెరిగే కొద్దీ దాని ప్రభావం ఆరోగ్యం మీద పడుతుంది. దీంతో గుండెపోటు, డయాబెటిస్ వంటి వ్యాధుల బారిన పడుతారని అధ్యయనంలో తేలింది. అందుకే చిన్నపిల్లలను ఆరోగ్యంగా, ఆనందంగా ఉంచాల్సిన బాధ్యత తల్లిదండ్రుల మీద ఉంటుంది. 7, 11, 16, 23, 33, 42 ఏండ్ల వయసున్న 7 వేలమంది మీద పరిశోధన జరిపారు. వీరిలో ఆందోళన, ఒత్తిడి వంటి లక్షణాలను పరిశోధకులు సేకరించి అధ్యయనం చేసిన తర్వాత వెల్లడించారు. కాబట్టి పిల్లల భవిష్యత్తు బాగుండాలంటే వారు బాల్యంలో ఆనందంగా ఉండేలా చూసుకోవాలి. లేదంటే 30 ఏండ్లు వచ్చేసరికి గుండె సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తుంది.

# తుమ్ములు.. ముక్కులో రక్తం.. ఎందుకు?



మా పాపకు 12 ఏండ్లు. తనకు నాలుగు రోజులుగా ముక్కు బ్లాక్ అవుతున్నది. తుమ్ములు వస్తున్నాయి. నిన్న రాత్రి ఊపిరి ఆడట్లేదంటూ గోల పెట్టింది. ఇవాళ తుమ్ములు ఆగకుండా వచ్చాయి. ఆ తరువాత ముక్కులో నుంచి రక్తం వచ్చింది. ఇలా ఎందుకు అయింది? దీనికి పరిష్కారం ఏమిటి? - మనస్విత, కామారెడ్డి ఇలా జరగడానికి కారణం ఎడమ వైపు ముక్కులో అలర్జీ, సైనస్ ఇన్‌ఫెక్షన్ ఉండటమే. దీనివల్ల ముక్కులో నీటి పదార్థాలు ఎక్కువగా చేరుతాయి. అలర్జీతో ముక్కులో కొన్ని రకాల జీవరసాయన చర్యలు జరగడం వల్ల రసాయనాలు ఎక్కువగా తయారవుతాయి. వీటివల్ల తుమ్ములు వస్తాయి. ఇలా తుమ్ములు ఆగకుండా వచ్చినప్పుడు అలర్జీకి సంబంధించిన మందులు వీలైనంత తొందరగా మొదలు పెట్టాలి. దాంతో రక్తస్రావం నివారించవచ్చు. అలర్జీ జన్యువుల ద్వారా వచ్చే సమస్య ఇది. కొన్నేండ్ల పాటు ఉంటుంది. ఈ సమస్య తీవ్రత ఎక్కువగా ఉండవచ్చు లేదా తక్కువ ఉండవచ్చు. అందువల్ల అలర్జీకి సంబంధించిన మందులు క్రమం తప్పకుండా చాలా కాలం వాడాల్సి ఉంటుంది. సైనసైటిస్, ఆస్తమా సమస్యలు రాకుండా నివారించవచ్చు. ముక్కు బ్లాక్ కావడం, తుమ్ములు రావడానికి ముందే ముక్కులో అలర్జీకి సంబంధించిన చర్యలు జరుగుతాయి. వీటివల్ల ముక్కు లోపల చర్మం పాడవుతుంది. ఇది 30 నుంచి 40 శాతం పాడైన తరువాత అలర్జీ లక్షణాలు బయటపడుతాయి. మందులు మొదలుపెట్టిన వారం రోజులకే అలర్జీ తగ్గిపోయినప్పటికీ ముక్కు లోపల జరిగే ఉత్ప్రేరకాల ప్రక్రియ కొన్ని వారాలు, నెలల పాటు జరుగుతుంది. ఈ ప్రక్రియ వల్ల చర్మం పాడవకుండా ఉండాలంటే అలర్జీ మందులు లక్షణాలు తగ్గిన తరువాత కూడా కనీసం రెండు మూడు నెలలు వాడాలి. అలా వాడటం వల్ల ఆస్తమా రాకుండా ఆపవచ్చు. వీలైనంత త్వరగా నిపుణుడిని సంప్రదించడం మంచిది.

# చిన్నారులపై ఆన్‌లైన్ క్లాసుల ప్రభావం




హైదరాబాద్ : కరోనా వైరస్ వ్యాప్తి నేపథ్యంలో దేశవ్యాప్తంగా పాఠశాలలు, కళాశాలలు మూతపడ్డాయి. అయితే, విద్యాసంవత్సరం నష్టపోకుండా ఉండేందుకు విద్యార్థులు ఇంటి వద్దనే ఉండి చదువుకునేలా ఆన్‌లైన్ క్లాసులకు ముందుగా ప్రైవేటు విద్యాసంస్థలు తెరలేపాయి. నిత్యం ఏడెనిమిది గంటలకు పైగా చిన్నారులను కంప్యూటర్లు, ల్యాప్‌టాప్‌లు, మొబైల్ ఫోన్ల ముందు కూర్చోబెడుతుండటంతో వారు ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నట్లు తేలింది. ఉదయం నిద్ర లేచింది మొదలు ఏడెనిమిది గంటల పాటు ఆన్‌లైన్ క్లాసులతో చిన్నారులకు విశ్రాంతి లేకుండా చేస్తున్నాయి. అదేపనిగా ఎదురుగా ఉన్న ఎలక్ట్రానిక్ పరికరంపై దృష్టిసారిస్తూ ఉండటం, స్క్రీన్‌పై అక్షరాలు కనిపించక కళ్లు పెద్దవి చేసి చూడటం వంటి కారణాల వల్ల చిన్నారుల కండ్లల్లో నీరు లేకుండా పోయి డ్రై ఐస్‌గా మారుతున్నాయి. ఫలితంగా కళ్ళు కదిలేటప్పుడు ఘర్షణ పెరిగి గాయాలవుతాయని వైద్యనిపుణులు చెప్తున్నారు. లాక్‌డౌన్ తరువాత కంటి సమస్యలతో చిన్నారులు బాధపడుతున్న కేసులు మునుపటి కంటే మూడు నుంచి నాలుగు రెట్లు పెరిగాయని వైద్యులు చెప్తున్నారు. గంటలకొద్ది ఎలక్ట్రానిక్ పరికరాలకు కళ్ళప్పగించడంతో ప్రతికూల వ్యత్యాసాన్ని కలిగించడమే కాక, శారీరక, మానసిక అభివృద్ధి కూడా నిలిచిపోతుందని నిపుణులు అంటున్నారు. కళ్ళజోడు పెట్టుకునే విద్యార్థుల సంఖ్య ఇటీవలి కాలంలో పెరుగుతోంది. కళ్ళు క్షీణించడం, తలనొప్పి, తల భారంగా అనిపించడం, కార్నియా దెబ్బతినడం, మైగ్రేన్ వంటి సమస్యలు ఉత్పన్నమవుతున్నట్లు చిన్నపిల్లల వైద్యులు గుర్తించారు. అదేపనిగా దగ్గరి నుంచి ఎలక్ట్రానిక్ పరికరాలను చూసేవారిలో కంటి లోపలి నుంచి తిరిగే కండరాలు చిరిగిపోవటం ప్రారంభించి కొన్ని రోజుల తరువాత పిల్లలు సమీపంలోని విషయాలను చదవలేరని వారు చెప్తున్నారు.

**ఇలా జాగ్రత్త పడండి**

ఆన్‌లైన్ తరగతులకు హాజరయ్యే విద్యార్థులు అదేపనిగా కంప్యూటర్, మొబైల్ స్క్రన్లపై చూడకూడదు. ప్రతి 20 నిమిషాలకు కళ్లకు విశ్రాంతి ఇవ్వాలి. నిరంతరం పనిచేస్తుంటే కళ్ళలో కందెన వంటి చుక్కలు లేదా కృత్రిమ కన్నీటి చుక్కలను వాడండి. తలనొప్పి ఉంటే కళ్లను పరీక్ష చేయించుకోవాలి. రేడియేషన్‌ను ఎక్కువగా ఇచ్చి క్యాన్సర్ ప్రమాదాన్ని పెంచే పాతకాలం కంప్యూటర్లకు దూరంగా ఉండాలి. ఎల్‌సీడీ, పీపీపీపై పని చేయండి.

చిన్న పిల్లలను మొబైల్ లేదా కంప్యూటర్‌పై ఎక్కువసేపు చూడకుండా ప్రయత్నించండి. ప్రతి అర్ధగంటకు ఒకసారి కూర్చున్న చోటు నుంచి కదలడం అలవాటు చేసుకోవడం ద్వారా మోకీళ్ల నొప్పులు, ఇతరత్రా సమస్యలు రాకుండా చూసుకోవచ్చు.

# గుండెపోటు రాకుండా ఉండాలంటే..



ఒకవ్కెపు వ్కెద్యరంగంలో అత్యాధునిక చికిత్సలన్నీ మన ముంగిటికి వచ్చి వాలుతున్నాయి. మరోవ్కెపు గుండెపోటు కేసులూ పెరిగిపోతున్నాయి. ఒకప్పుడు 50, 60 ఏండ్లు దాటితే వచ్చే గుండె సమస్యలు.. ఇప్పుడు 30ల్లోనే పలకరిస్తున్నాయి. గుండె అనేది శరీరంలోని ముఖ్యమైన అవయవం. గుండె పనితీరు సజావుగా ఉంటేనే శరీరంలోని అన్ని అవయవాల పనితీరు మెరుగ్గా ఉంటుంది. గుండె పనితీరు సరిగ్గా లేదంటే ఆ ప్రభావం ఇతర అవయవాలపై పడుతుంది. రక్తాన్ని ఫిల్టర్ చేసి శరీరంలోని ప్రతి భాగానికి అక్సిజెనెటేడ్ రక్తాన్ని ఆర్టరీస్ ద్వారా సరఫరా చేయడంలో గుండె ప్రధాన పాత్ర పోషిస్తుంది. కొన్ని వ్యాధుల వలన లేదా కొన్ని గాయాల వలన గుండె సరిగ్గా పనిచేయకపోతే శరీరంలోని ఇతర అవయవాలకు రక్త సరఫరాలో ఆటంకాలు ఏర్పడవచ్చు. తద్వారా, వాటి పనితీరు కూడా దెబ్బతింటుంది. మారుతున్న జీవనశైలి, ఆహారపు అలవాట్లు, ఒత్తిళ్లు, ఆందోళన వంటి సమస్యల వల్ల గుండె సంబంధిత వ్యాధులు వస్తున్నాయని చెబుతున్నాయి కొన్ని పరిశోధనలు.

కరోనో వైరస్ వ్యాప్తి కారణంగా ప్రజలు ఎక్కువ సమయం ఇంట్లోనే గడుపుతున్నారు. అయితే తగినంత శారీరక శ్రమ లేకపోవడం, అతిగా తినడం వల్ల గుండెపోటు, అధిక రక్త కొలెస్ట్రాల్ వంటి సమస్యలు చిన్న వయస్సులోనే సంభవిస్తున్నాయి. శారీరక వ్యాయామం లేకపోవడం వల్ల, చాలా మంది ప్రజలు ఈ రోజు అనేక వ్యాధులతో బాధపడుతున్నారు. అధిక రక్తపోటు, తక్కువ రక్తపోటు, స్ట్రోక్, గుండెపోటు, పెరిగిన కొలెస్ట్రాల్ వంటి గుండె సంబంధ వ్యాధులు వంటివి మనపై దాడి చేస్తాయి.

**గుండెపోటు ఎందుకు వస్తుంది..**

క్రమరహిత నిత్యకృత్యాలు, కొవ్వు ఎక్కువగా ఉండే ఆహారం తినడం, వ్యాయామం చేయకపోవడం వల్ల రక్త ధమనుల్లో కొలెస్ట్రాల్ స్థాయి పెరుగుతుంది. శరీరంలో కొలెస్ట్రాల్ స్థాయి పెరిగినప్పుడు, రక్త రవాణా ప్రభావితమవుతుంది. అధిక కొలెస్ట్రాల్ కారణంగా గుండెకు రక్తం సరఫరా చేసే ధమనులు తగ్గిపోతుంటే, గుండె ఒత్తిడి చెందడం ప్రారంభించి చివరికి వ్యాధిగా మారుతుంది. క్రమరహిత దినచర్య కారణంగా గుండెపోటు చిన్న వయస్సులో కూడా కనిపిస్తుంది. ఈ సమస్యతో బాధపడుతున్న వ్యక్తి ఛాతీ, చేతులు, దవడ, భుజం లేదా మెడలో నొప్పిని అనుభవిస్తాడు. శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, వాంతులు, కడుపు నొప్పి, చెమట, అధిక అలసట, మైకం కమ్మడం లేదా మూర్ఛ వంటి లక్షణాలు కనిపిస్తాయి. కొన్నిసార్లు ఎలాంటి లక్షణాలు కనిపించకుండానే గుండెపోటు వస్తుంటుంది. నడిచినా, మెట్లెక్కినా ఆయాసం, గుండెలో నొప్పి, గుండె పట్టేసినట్లు ఉండటం, ఒక్కోసారి భోజనం చేసిన తర్వాత కూడా ఇలా జరగొచ్చు. ఛాతీలో నొప్పి లక్షణాలు కనిపించిన వెంటనే వైద్యుడిని సంప్రదించాలి. ఇలాంటి సమస్య వచ్చిన సందర్భాల్లో ఒక్కరే దవాఖానకు వెళ్లకుండా కుటుంబసభ్యులు, స్నేహితులను తీసుకెళ్లాలి.

**ఛాతీలో నొప్పివచ్చినప్పుడు..**

ఛాతీలో నొప్పి అనిపిస్తే మొదట గుండె పరీక్షలు చేయించాలి. ఈసీజీ పరీక్షలో గుండె కొట్టుకునే తీరును గుర్తించవచ్చు. ఒత్తిడి పరీక్షతోపాటు కొలెస్ట్రాల్, ట్రైగ్లిజరైడ్ గురించి రక్త పరీక్షలు చేస్తారు. ఛాతీలో నొప్పి ఉన్నప్పుడు భయపడాల్సిన అవసరం లేదు. ఎందుకంటే ఈ రోజుల్లో దాని కోసం అనేక రకాల ఆధునిక చికిత్సలు అందుబాటులో ఉన్నాయి.

**గుండెపోటు రాకుండా ఉండటానికి హోం రెమెడీస్**

గుండెపోటు రాకుండా చూసుకోవడానికి మన ఇంట్లోనే అనేక ఔషధలు అందుబాటులో ఉన్నాయి. వీటిని నిత్యం ఆహారంలో భాగం చేసుకోవడం ద్వారా గుండెను ఆరోగ్యంగా ఉంచుకోవచ్చు. వెల్లుల్లి, అల్లం, నిమ్మ, ఆపిల్ వెనిగర్, తేనె వంటివి ప్రతిరోజుల తీసుకునేలా మెనూ సిద్ధం చేసుకోవాలి. పరిగడుపునే నీటిలో తేనె, నిమ్మరసం కలుపుకొని తాగడం వలన గుండె సమస్యలు రాకుండా చూసుకోవచ్చు.

**ఈ జాగ్రత్తలు తీసుకోవాలి..**

ఉదయాన్నే అరగంట పాటు నడవడం అలవాటు చేసుకోవాలి. డైనింగ్ టేబుల్‌పై ఉప్పు డబ్బా లేకుండా చూసుకోవాలి. రోజులో ఒకటిన్నర స్పూన్ ఉప్పు మాత్రమే తీసుకోవాలి. -నిత్యం ఐదు రకాల పండ్లు తినండం అలవాటు చేసుకోవాలి. -ఆల్కహాల్ అధిక మోతాదులో తీసుకోవద్దు. -అందుబాటులో ఉన్న మెట్లు ఎక్కండి. దగ్గర్లోని ప్రాంతాలకు సైకిల్‌పై వెళ్లేలా చూసుకోవాలి. - సిగరెట్ తాగే అలవాటును వెంటనే మానేయాలి. -కొవ్వు పదార్థాలు తక్కువగా ఉండే ఆహారాలను తీసుకోవాలి. -పిడ్ ప్రొఫైల్, బ్లడ్ షుగర్, బి.పి పరీక్షలను తరచుగా చెక్ చేయించుకోవాలి. - శరీరం బరువును నియంత్రణలో ఉంచుకోండి. ఎత్తుకు తగిన బరువు ఉండేలా చూసుకోండి. - ఏడాదికొకసారి కంప్లీట్ హెల్త్ చెకప్ చేయించుకోండి. -డయాబెటిస్ ఉన్నట్లయితే నియంత్రణలో ఉంచుకునేలా చూసుకోవాలి.

# విశాఖ విమానాశ్రయం లో ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి కి ఘనస్వాగతం







విశాఖపట్నం **(విజయభాను న్యూస్) :** ఒక రోజు పర్యటనలో భాగంగా విశాఖపట్నం విచ్చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి గౌ.వైఎస్ జగన్ మోహన్ రెడ్డి, ఉదయం 11గంటల 13 నిమిషాలకు ప్రత్యేక విమానంలో విశాఖ విమానాశ్రయం చేరుకున్నారు. విశాఖ విమానాశ్రయంలో ముఖ్యమంత్రికి మంత్రులు, అధికారులు ఘనస్వాగతం పలికారు. ఉప ముఖ్యమంత్రి మరియు గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి బూడి ముత్యాల నాయుడు, ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్, బలహీన వర్గాల సంక్షేమం, సినిమాటోగ్రఫీ, సమాచార పౌర సంబంధాలు శాఖామంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణమున్సిపల్ శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్, ప్రభుత్వ విఫ్ కరణం ధర్మశ్రీ, పార్లమెంటు సభ్యులు ఎం వి.వి. సత్యనారాయణ, నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, జిల్లా పరిషత్ చైర్ పర్సన్ జల్లేపల్లి సుభద్ర, జిల్లా కలెక్టర్ డా ఏ మల్లికార్జున, నగర పోలీస్ కమిషనర్ త్రివిక్రమ వర్మ , జాయింట్ కలెక్టర్ కె ఎస్ విశ్వనాథన్, ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి, శాసనసభ్యులు వాసుపల్లి గణేష్ కుమార్, ముత్తం శెట్టి శ్రీనివాసరావు, తిప్పల నాగిరెడ్డి, అదీప్ రాజ్, వి.ఎం.ఆర్.డి.ఏ చైర్ పర్సన్ అక్కరమని విజయనిర్మల, డిసిసిబి చైర్మన్ కోలాగురువులు, రెవెన్యూ డివిజినల్ అధికారి హుస్సేన్ సాహెబ్ తదితరులు ముఖ్యమంత్రికి ఘనస్వాగతం పలికారు. ముఖ్యమంత్రి తోపాటు జిల్లా ఇంచార్జ్ మరియు ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని, విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, టి టి డి చైర్మన్ వై వి సుబ్బారెడ్డి విచ్చేశారు. అనంతరం విశాఖ విమానాశ్రయం నుండి నగరంలో జరిగే కార్యక్రమాల్లో పాల్గొనేందుకు ముఖ్యమంత్రి రోడ్డు మార్గాన బయలుదేరి వెళ్లారు.



















విశాఖ జిల్లాలో ఆంధ్ర యూనివర్సిటీ కి చేరుకున్నముఖ్యమంత్రి ప్రారంభోత్సవ కార్యక్రమం అనంతరం అక్కడ అనారోగ్యంతో బాధపడుతూ ముఖ్యమంత్రిని కలవడానికి వేచి ఉన్న పెద వాల్తేర్ కు చెందిన కె. రమేష్ (11)ని ముఖ్యమంత్రి పలకరించారు. తల్లి కె. లక్ష్మి, తన కుమారుడు కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడని, వైద్య సేవల నిమిత్తం ముఖ్యమంత్రిని ఆర్థిక సహాయం కోరగా ముఖ్యమంత్రి స్పందిచి వైద్యం ఖర్చుల నిమిత్తం ఆర్థిక సహాయం చేయాల్సిందిగా జిల్లా కలెక్టర్ ను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ వెంటనే రమేష్ వైద్య ఖర్చుల నిమిత్తం లక్ష రూపాయల చెక్కును అందజేశారు.



కేన్సర్ తో బాధపడుతున్న ఏ.తులసి (31) కు ముఖ్యమంత్రి లక్ష రూపాయలు ఆర్థిక సహాయం. విశాఖపట్నం, ఆగష్టు1: మంగళవారం విశాఖ జిల్లాలో ఆంధ్ర యూనివర్సిటీకి చేరుకున్న ముఖ్యమంత్రి ప్రారంభోత్సవ కార్యక్రమం అనంతరం అక్కడ అనారోగ్యంతో బాధపడుతూ ముఖ్యమంత్రిని కలవడానికి వేచి ఉన్న పద్మనాభం మండలం కొవ్వాడ గ్రామానికి చెందిన ఏ. తులసి (31) ని ముఖ్యమంత్రి పలకరించారు. తులసి మాట్లాడుతూ తాను వాలంటీర్ గా పనిచేయుచున్నానని , కొంత కాలంగా కాన్సర్ వ్యాధితోబాధపడుతున్నానని, వైద్య సేవల నిమిత్తం ముఖ్యమంత్రిని సహాయం కోరగా ముఖ్యమంత్రి తక్షణమే స్పందించి వైద్యం కోసం ఆర్థిక సహాయం అందించాలని జిల్లా కలెక్టర్ ను ఆదేశించారు. ముఖ్య మంత్రి ఆదేశాల మేరకు జిల్లా కలెక్టర్ డా. ఎ. మల్లిఖార్జున తులసికి వైద్య ఖర్చుల నిమిత్తం 1 లక్ష రూపాయల చెక్కును అందజేశారు.



తీవ్ర అనారోగ్యంతో భాధపడుతున్న మోహన్(17) ను పరామర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. పెందుర్తి మండలం వేపగుంటకు చేందిన వీరవల్లి మోహన్ తాను 4వ అంతస్తు నుండి పడిపోయానని, వెన్నపూస దెబ్బ తిన్నదని ఆరోగ్య శ్రీ లో వైద్యం పొందినట్లు తెలిపారు. ఇంకా కోలుకోలేదని, వైద్య సేవల నిమిత్తం ముఖ్యమంత్రి ని సహాయం కోరగా ముఖ్యమంత్రిస్పందిచి ఫిజియో ధెరపి వైద్యం కోసం ఆర్థిక సహాయం అందించాలని జిల్లా కలెక్టర్ ను ఆదేశించారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు జిల్లా కలెక్టర్ డా. ఎ. మల్లిఖార్జున వీరవల్లి మోహన్ కు వైద్య ఖర్చుల నిమిత్తం 1 లక్ష రూపాయల చెక్కును అందజేశారు.



ఆర్థోపెడిక్ సమస్యతో బాధపడుతున్న గవిడి ఢిల్లీశ్వరరావు (9) ను ముఖ్యమంత్రి పరామర్శించారు. కంచరపాలెం, బాపూజీనగర్ కు చెందిన ఢిల్లీశ్వరరావు తల్లి గవిడి సంతోషి, తన కుమారుడు పుట్టుకతో ఆర్థోపెడిక్ సమస్య తో బాధపడుతున్నాడని ముఖ్యమంత్రికి తెలిపారు. వారి సమస్యను విన్న ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డి గవిడి ఢిల్లీశ్వరరావుకి వైద్య సేవలు నిమిత్తంఆర్థిక సహాయం చేయాల్సిందిగా జిల్లా కలెక్టర్ డా. ఎ. మల్లిఖార్జనను ఆదేశించగా జిల్లా కలెక్టర్ డా. మల్లిఖార్జున వైద్య సేవలు నిమిత్తం లక్ష రూపాయల చెక్కును అందజేసారు.

## శాశ్వత భూహక్కు దారులుగా గుర్తింపునకు వినతి

ఆముదాలవలస,: 20 సూత్రాలు అమలులో భాగంగా తమకు అప్పటి అధికారులు కేటాయించిన భూములు పై శాశ్వత భూహక్కు కల్పించేలా చొరవ తీసుకోవాలని సరుబుజ్జిలి మండలం పురుషోత్తపురం గ్రామానికి చెందిన పలువురు రైతులు సభాపతి తమ్మినేని సీతారాం కు విన్నవించుకున్నారు. ఈ మేరకు భూములకు సంబందించిన వాస్తవ పరిస్థితితులకు సభాపతి కి వివరిస్తూ స్పీకర్ క్యాంప్ కార్యాలయం వద్ద వినతి పత్రం అందజేశారు.వివరాలు ఇలా ఉన్నాయి..తమ గ్రామములో అవధానుల చెరువు ప్రక్కన గల భంజరు భూమి సర్వే నెంబర్లు (1) 249, (2) 254/2, (3) 248/1 లలో, 1976 సంవత్సరములో 20 సూత్రాల ప్రాతిపదికన నిరుపేద ప్రజలకు ప్రభుత్వ భూమిని పంచడం ద్వారా తమకు భూములు ఇచ్చియున్నారన్నారు.ఆ యొక్క భూమిలో పెద్ద కంచి చెట్లు, మట్టి దిబ్బలు, గచ్చపొదలు మొదలగునవి తీసివేసి అయొక్క భూమినంత చదును చేసి సాగు చేసుకుంటూ ఉన్నామన్నారు. ప్రభుత్వం వారు కో-ఆపరేటివ్ జాయింటు ఫార్మింగ్ ద్వారా రిజిష్టరీ చేసి చేతి పనిముట్లు,దుక్కి పశువులు మరియు నీటి ఇంజనులు ఇచ్చియున్నారన్నారు. అప్పటి నుంచి సాగు చేసుకొంటూ జీవనోపాధి పొందుతున్నామని వివరించారు.2018వ సంవత్సరములో జాయింటు ఫార్మింగ్ సొసైటీల క్రింద ఉన్న భూములకు సర్వే చేసి రైతులకు నేరుగా పట్టాలు ఇచ్చి వారికి పూర్తి హక్కులు కల్పించుటకు గానూ ప్రభుత్వం భూమిని తే. 29.05.2018 నుండి తే. 22.06.2018దీ వరకు శ్రీకాకుళం యూనిట్-4 ఎ.డి. గారి ఉత్తర్వులతో మండల సర్వేయరు మరియు గ్రామ వి.ఆర్.ఓ. మరియు కో-ఆపరేటివ్ జాయింటు ఫార్మింగ్ ఎడాప్టింగ్ ఆఫీసరు ఆధ్వర్యంలో డి.జి.పి.ఎస్. మెషిన్ ద్వారా సర్వే చేసి ప్రతి రైతుకి సర్వే నెంబరు కేటాయించి ఎగ్రిమెంటు చేసి యున్నారని తెలిపారు.

VIJAYABHANU - Visakhapatnam
Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of **VIJAYABHANU PUBLICATIONS .,** Published and Printed at **VIJAYABHANU PRESS,** D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003.
R.N.I. No. 32157/77. Postal Regd. No. J/VM-RNP/32 ⋆ Phone : 2564353, Fax : 0891-2569004 ⋆ e-mail: vijayabhanudaily@gmail.com